వైఎస్ఆర్ కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 12 మార్చి 2026

## ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**రాయచోటి మార్చి 11 ప్రభాతవార్త :** రంజాన్ మాసం సందర్భంగా ఈనెల 15వ తేదీన అన్నమయ్య జిల్లా రాయచోటిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్నటువంటి ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముస్లిం సోదరులు సోదరీమణులు మరియు ప్రజలు భారీగా హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పత్రికా ప్రకటనలో కోరారు.

## నగిరిగుట్టలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల మెరుపు దాడులు

కోడి పందాలు, నక్క ముట్టి స్థావరాలపై దాడి

15 మంది అరెస్ట్, రూ.9,900 స్వాధీనం

వార్త.. 2లో



# జలధార ప్రాజెక్టును అభినందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

### పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**మదనపల్లె, మార్చి 11 ప్రభాతవార్త :** అన్నమయ్య జిల్లాలో చెరువులను నింపి భూగర్భ జలాలను పెంచేందుకు చేపట్టిన ప్రాజెక్టు జలధారను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో ప్రాజెక్టు జలధారణ అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. నేడు అమరావతిలో జరిగిన ఆరవ కలెక్టర్ల సదస్సులో అన్నమయ్య జిల్లా పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా రాయలసీమ ప్రాంతంలో కరువు జిల్లాగా ఉందని ప్రతి సంవత్సరం వర్షపాతం తక్కువగా ఉంటుందని కాబట్టి కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన నదుల అనుసంధానం కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకొని స్వర్ణాంధ్ర 2047లోని దాదాపు 10 సూత్రాలను ఆధారంగా ఐదు సూత్రాలను ఉపయోగించుకొని ప్రాజెక్టు జలధార కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రోజుకు సుమారు 20 వేల నుండి 30 వేల వరకు కార్మికులు అందుబాటులో ఉండటంతో చెరువుల పునరుద్ధరణ, ఫీడర్ కాలువల శుభ్రపరిచే పనులు, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఉపగ్రహ చిత్రాలు, వెబ్ పోర్టల్ ఆధారంగా జిల్లాలోని చెరువులు, జలాశయాల స్థితిని పరిశీలించి ఎంత నీరు నిల్వ ఉందో, ఏ చెరువులు ఖాళీగా ఉన్నాయో, ఏవి 50 శాతం లేదా 25 శాతం కంటే తక్కువ స్థాయిలో ఉన్నాయో గుర్తించామన్నారు. అదేవిధంగా గ్రామాల పెద్దలు, స్థానిక ప్రజల నుండి గత 25 నుండి 40 సంవత్సరాల కాలంలో చెరువులకు నీరు వచ్చే మార్గాలు, ఫీడర్ కాలువల వివరాలు సేకరించి వాటిని పునరుద్ధరించే చర్యలు చేపట్టామన్నారు. ఈ విధంగా జిల్లాలోని చిన్న చిన్న కాలువలను పరస్పరం అనుసంధానం చేసి నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం జరిగిందన్నారు. ఇటీవల సంభవించిన రెండు తుఫానుల వల్ల కురిసిన వర్షాలను కూడా ఈ కార్యక్రమానికి అవకాశంగా మార్చుకుని జిల్లాలో పడిన ప్రతి చుక్క నీటిని నిల్వ చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఫలితంగా 2025 ఆగస్టు నెల నుండి డిసెంబర్ నాటికి అది 8.59 మీటర్ల వరకు భూగర్భ జలాలు పెరిగాయి అన్నారు. ఈ చర్యల వల్ల జిల్లాలో దాదాపు 20 వేల పనికిరాని బోర్లు మళ్లీ నీటిని ఇస్తున్నాయని అలాగే భూగర్భ జలాల స్థాయి పెరగడంతో వ్యవసాయ విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న వ్యవసాయ కనెక్షన్ల విద్యుత్ వినియోగం తగ్గింది అన్నారు. గత సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే వ్యవసాయ విద్యుత్ వినియోగంలో 35 నుండి 40 శాతం వరకు తగ్గుదల నమోదయిందన్నారు. ఈ చర్యల వల్ల ఆగస్టు నుండి నవంబర్ వరకు మాత్రమే సుమారు రూ.96 కోట్ల విద్యుత్ ఖర్చు ఆదా అయిందన్నారు. ఆగస్టులో పూర్తిగా ఎండిపోయిన చెరువులు ఉండగా ప్రస్తుతం ప్రతి చెరువులో కనీసం 25 శాతం నుండి 50 నీరు నిల్వ ఉండే స్థితి ఏర్పడిందన్నారు. ఈ నీటి నిల్వ పెరుగుదలతో జిల్లాలోని జలాశయాల విస్తీర్ణం సుమారు 1.13 లక్షల ఎకరాలు పెరిగిందని, రైతులు ఉద్యానవన పంటల సాగుపై మరింత ఆసక్తి చూపుతున్నారన్నారు. గత మూడు సంవత్సరాలతో పోల్చితే ఈ ఏడాది ఉద్యానవన పంటల విస్తీర్ణం గణనీయంగా పెరిగి సుమారు 20 వేల హెక్టార్లు అదనంగా పెరిగిందన్నారు. నీటి లభ్యత పెరగడంతో జిల్లాలో సుమారు 5 లక్షల ఎకరాల్లో పశుగ్రాసం అందుబాటులోకి వచ్చిందని, దీనిని దృష్టిలో ఉంచుకుని పాల ఉత్పత్తి పెంపుపై కూడా ప్రత్యేక దృష్టి సాధించడం ద్వారా గత కొద్ది నెలల్లో జిల్లాలో 10,600 పాల పశువులను అదనంగా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. దీని ద్వారా రోజుకు సుమారు 1 లక్ష లీటర్ల అదనపు పాల ఉత్పత్తి సాధించామన్నారు. ఉదాహంణకు పీలేరు మండలంలోని గండ్లపల్లె గ్రామంలో గండ్లపల్లె చెరువుల్లో నీరు నిల్వ ఉండటంతో రైతులు పశువుల పెంపకంలో ముందుకు వచ్చి ఆదాయం రెట్టింపు చేసుకున్నారన్నారు. ఈ ప్రాజెక్టు జలధార కార్యక్రమం ద్వారా వ్యవసాయం, ఉద్యానవనం మరియు పశుసంవర్ధక రంగాల అభివృద్ధితో జిల్లాకు వచ్చే ఏడాదిలో సుమారు రూ.2,200 కోట్ల జిడిపి పెరుగుదల కనిపిస్తుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో దీర్ఘకాలిక నీటి భద్రతను సాధించి రైతులకు స్థిరమైన ఆదాయ వనరులు కల్పించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు తోడ్పడడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రివర్యుల అబినందన. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు మాట్లాడుతూ..... అన్నమయ్య జిల్లా వంటి కరువు ప్రాంతంలో ప్రాజెక్టు జలధార ద్వారా 8.5 9 మీటర్ల మేర భూగర్భ జలాలను పెంచడం ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ కు ఒక నిదర్శనమని అభినందించారు. గత రెండు సంవత్సరాలలో రాష్ట్రవ్యాప్తంగా 1.82 మీటర్ల భూగర్భ జలాలు పెరిగితే కేవలం అన్నమయ్య జిల్లాలో ఒక సంవత్సరంలోనే 8.59 మీటర్ల భూగర్భ జలాలు పెరిగాయని పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టు జలధార పేరుతో అన్ని జిల్లాలలో ఈ ప్రాజెక్టును అమలు చేయాలని కనీసం నాలుగు మీటర్ల మేర భూగర్భ జలాలను పెంచేందుకు అన్ని జిల్లాల కలెక్టర్లు కృషి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో అమలు చేసిన పట్టిసీమ ప్రాజెక్ట్ ద్వారా కృష్ణా డెల్టాకు నీరు అందించి, అక్కడి నుంచి రాయలసీమ ప్రాంతాలకు సాగునీరు అందించగలిగినట్టు తెలిపారు. ఈ చర్యల వల్ల రాయలసీమలో సాగు విస్తీర్ణం పెరిగి రైతులకు పెద్ద మేలు జరిగిందని చెప్పారు. ప్రాజెక్టు జలధర అన్నమయ్య జిల్లా ఆర్థిక అభివృద్ధి అభివృద్ధిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని పశుసంవర్ధక రంగంలో 250 కోట్లకు పైగా, విద్యుత్ వినియోగంలో సుమారు 95 కోట్ల రూపాయల ఆర్థిక ప్రయోజనం కలుగుతోందన్నారు. ఆర్థిక అభివృద్ధి మాత్రమే కాకుండా సుస్థిర అభివృద్ధికి మరియు అడవుల విస్తీర్ణం పెంచడానికి ప్రయోజ నకరంగా ఈ ప్రాజెక్టు జలధార ఉందని పేర్కొన్నారు. రాయలసీమ జిల్లాలలో కరువు పీడిత జిల్లా అయిన అన్నమయ్య జిల్లాలో చేపట్టిన ఈ ప్రయోగంఒక అద్భుతమైన నమూనాగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ నమూనాను ఆధారంగా తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా"జలధారా" కార్యక్రమాన్ని 90 రోజుల పాటు అమలు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమం ద్వారా కనీసం 3 నుండి 4 మీటర్ల వరకు భూగర్భ జలాల పెరుగుదల సాధించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

## అరటి ధరలపై అపోహలు వద్దు

పెద్ద రంగాపురం రైతు తోట పరిశీలన

నాణ్యతను బట్టి టన్ను రూ.10వేల నుండి రూ.15 వేల వరకు విక్రయాలు

జిల్లా ఉద్యాన అధికారి సతీష్



**పులివెందుల, మార్చి 11, ప్రభాతవార్త :** అరటి రైతు పరిస్థితి అంతే" అనే శీర్షికతో కొన్ని పత్రికలలో ప్రచురితమైన వార్తా కథనంపై వైఎస్సార్ కడప జిల్లా ఉద్యాన అధికారి సతీష్ స్పందించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకోవడానికి పులివెందుల పరిధిలోని పెద్ద రంగాపురం గ్రామానికి చెందిన రైతు అంకాల్ రెడ్డి తోటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భం గా రైతు అంకాల్ రెడ్డి మాట్లాడుతూ తాను రెండున్నర ఎకరాలలో అరటి తోటను సాగు చేసినట్లు తెలిపారు. మొదట టన్ను రూ.15,000 ధరకు, తరువాత రూ.13,000 ధరకు అరటిని విక్రయించినట్లు చెప్పారు. చివర్లో నాణ్యత బాగాలేని గెలలను కోసివేసి అరటి పంటను దున్నివేసినట్లు వివరించారు. అలా తీసివేసిన గెలలను మేకలు తింటుండగా పత్రికా విలేకరులు ఫోటోలు తీసి వార్తగా ప్రచురించినట్లు ఆయన తెలిపారు. అనంతరం జిల్లా ఉద్యాన అధికారి సతీష్, పులివెందుల ఉద్యాన అధికారి రాఘవేంద్ర రెడ్డి కలిసి పులివెందుల మరియు లింగాల మండలా లలో అరటి కోతలు జరుగుతున్న రైతుల పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ప్రస్తుతం అరటి నాణ్యతను బట్టి టన్ను రూ.10,000 నుండి రూ.15,000 వరకు వ్యాపారస్తులకు విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు. అరటి ధరల విషయంలో రైతులు అపోహలు నమ్మి తక్కువ ధరలకు పంటను విక్రయించ కూడదని ఆయన సూచిం చారు. అలాగే మార్కెట్ పరిస్థితులను తెలుసుకొని సరైన ధరకు విక్రయాలు చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల హార్టికల్చర్ అధికారి రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రగతి,పరిపాలన, పార్టీ వైపు

## మంత్రి మండిపల్లి చూపు

## కీలకం కానున్న స్థానిక ఎన్నికలు



**రాజంపేట, మార్చి 11 ప్రభాతవార్త** శాసనసభ్యులు అయినా, మంత్రులైనా పనితీరే ప్రామాణికమని, అటు పార్టీకి, ఇటు ప్రజలకు, అటు అభివృద్ధిపై దృష్టి సారిస్తేనే ఉంటారు. ఈ విషయంలో ఎలాంటి రిలాక్సేషన్స్ ఎవరికీ ఉండవని ఇటీవల పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పనితీరుపై మెరుగుపై దృష్టి సారించారు. ఇంట గెలిచి రచ్చ గెలవాలని సీరియస్ గానే తీసుకున్నట్టు తెలుస్తోంది. ఒకవైపు సొంత నియోజకవర్గ కేంద్రమైన రాయచోటి జిల్లా కేంద్రం కూడా మదనపల్లెకు పోవడం ఆయనకు రాజకీయంగా ఇబ్బందికరమైన విషయమైనా ఆ తర్వాత సీఎంతో చర్చించి అభివృద్ధి వైపు దృష్టి సారించారు. ప్రధానంగా హంద్రీనీవా పథకం ద్వారా నియోజకవర్గంలో సాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని అభ్యర్థించారు. నిధులు విడుదలకు సీఎం కూడా అంగీకరించారు. అంతేకాకుండా తాగునీటి సమస్య పరిష్కారానికి ఏకంగా ఈ వర్గానికి 350 కోట్లు నిధులు మంజూరు చేయించారు. రాయచోటి ఏరియా ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటు చేయడంలో చొరవ చూపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆసుపత్రుల అభివృద్ధికి విధులు మంజూరు చేయించడంపై దృష్టి పెట్టారు. మరో జిల్లా ఇన్చార్జ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో కలిసి ఆర్ అండ్ బి రహదారుల కోసం పక్కా ప్రణాళికలతో రోడ్లు మంజూరు చేయించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో విస్తృతంగా సిమెంట్ రోడ్లు నిర్మించేందుకు కార్యచరణ రూపొందించి ముమ్మరంగా పనులు చేస్తున్నారు. మంత్రిగా పనితీరులో నాలుగో ర్యాంక్ ఉన్న మరింత మెరుగుకు కృషి చేస్తున్నారు. ఇటీవల మంత్రుల కు క్రీడా పోటీలు నిర్వహించడంలో సక్సెస్ అయ్యారు. బడ్జెట్ కు ముందు రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి144 కోట్లు కేటాయించామని, కేంద్రం నిధులు కూడా మంజూరు చేయాలని ఢిల్లీకి వెళ్లి కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుక్ మాండవియా ను కలిశారు. వివిధ కేంద్ర పథకాల కింద క్రీడల అభివృద్ధికి రాష్ట్రానికి నిధులు మంజూరు చేయాలని కోరారు .అలాగే నియోజకవర్గంలో రాష్ట్ర రహదారులు జాతీయ రహదారులకు లింక్ చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ని కూడా కలిసి కోరారు. నియోజకవర్గంలో అభివృద్ధి సాధిస్తూనే (మిగతా 2వ పేజీలో)

## మండుతున్న కొండలు

# ఆందోళనలో ప్రజలు



**కడప, మార్చి 11, ప్రభాతవార్త:** ఎండకాలం వచ్చిందంటే అటువైపు ప్రాంతం ప్రజలు తీవ్ర ఆందోళన చెందటం చూస్తూనే ఉన్నాం. ఎండాకాలం వచ్చిందంటే ఏదో ఒకచోట కొండలు మండుతూనే ఉంటాయి అటు ఫారెస్ట్ అధికారులు ఎంత అవగాహన కల్పించిన పల్లి ప్రాంత ప్రజలు కొండకు నిప్పు పెట్టడం మారడం లేదు ఊరికి సమీపంలో కొండలు ఉండటంతో ఆ మంటలు ఎక్కడ ఊరు పైకి వస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు రాజంపేట మండలం రామాపురం ప్రాంతంలో ఈరోజు 7 గంటల ప్రాంతంలోనే ఒక్కసారిగా కొండంత మంటలు వ్యాపించడంతో అతి సమీపంలో ఉన్న రామాపురం గ్రామప్రజలు భయాందోళన గురయ్యారు సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో చిన్న మంటగా మొదలై ఒక్కసారిగా కొండంత మంటలు వ్యాపించాయని గ్రామస్తులు తెలిపారు. చూస్తుండగానే పెద్ద పెద్ద మంటలు రావడంతో ఎక్కడ గ్రామం వైపు వస్తుందా అని ప్రజల ఆందోళన చెందారు. ప్రతి ఏడాది ఇదేవిధంగా కొండలు మండుతున్నాయని ఎక్కడ గ్రామం వైపు వచ్చి గ్రామాన్ని దహించేస్తుందని ప్రజలు భయాన్ని వ్యక్తం చేశారు. దయచేసి అధికారులు కొండకు దగ్గర ఉన్న గ్రామాలలో అవగాహన కల్పించి కొండకు నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## జిల్లా పోలీసుల ప్రత్యేక దాడులు

### 4,400 కిలోల గంజాయి స్వాధీనం - ముగ్గురు అరెస్ట్



**కడప క్రైం, మార్చి 11, ప్రభాతవార్త:** కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో చిన్నచౌకు పీఎస్ పరిధిలో గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దాడులు నిర్వహించగా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 4,400 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు, చిన్నచౌకు సీఐ ఓబులేసులు తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ కడప నగరం ఎన్‌జీవో కాలనీలో ఉన్న సానే హరికృష్ణ, సురేష్‌బాబు, పార్నపల్లి నవీన్ అనే ముగ్గురు గంజాయి విక్రయాలు చేస్తుండడంతో వారిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి గంజాయితో పాటు ఒక ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్, ఒక ఫోన్, రూ.2వేలు నగదు సావధీనం చేసుకున్నామన్నారు. గంజాయి విక్రయాలు, అక్రమ రవాణాపై పోలీసులు నిరంతర నిఘా ఉన్నట్లు పేర్కొన్నారు. గంజాయి వినియోగం ఆరోగ్యానికి, కుటుంబానికి మరియు సమాజానికి హానికరమన్నారు. గంజాయి అక్రమ రవాణా లేదా విక్రయాలలో పాల్గొనే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయడం, నగర బహిస్కరణ వంటి కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకోవడంలో అత్యంత చాకచక్యంగా వ్యవహరించిన చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్పైలు రాజరాజేశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది యోగ, వేణు, శివకుమార్, ఓబులేసు, ఖాదర్ హుసేన్, సుధాకర్ యాదవ్, మాధవరెడ్డి, సాయికృష్ణ, ఇతర సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



రహదారుల విస్తరణ పై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కి వివరిస్తున్న ఎంపీ

## 14 బస్తాలు బియ్యం స్వాధీనం

**దువ్వూరు, మార్చి 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కానగూడూరు గ్రామంలో బుధవారం 14 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు మండల రెవెన్యూ ఇన్స్ స్పెక్టర్ జాన్సన్ తెలిపారు. తనిఖీలలో భాగంగా ఈ కార్యక్రమాలు చేపట్టగా కానగూడూరు సమీపంలో గడ్డివాములో 14 బస్తాల్లో నిల్వ ఉన్న బియ్యాన్ని స్వాధీన పరచుకున్నామన్నారు. ఇవి సుమారు 700 కేజీలు ఉన్నట్లు తెలిపారు. వీటిని మైదుకూరు సివిల్ సప్లై గోడౌనుకు తరలిస్తున్నామని పేర్కొన్నారు. ఈ దాడిలో వీఆర్వో శోభ సిబ్బంది పాల్గొన్నారు.



బుధవారం అమరావతిలో జరిగిన ఆరవ కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

## బోడిరెడ్డిగారి పల్లెలో రెవెన్యూ సమస్యల పరిష్కార వేదిక



**చిన్నమండెం మార్చి 11 ప్రభాతవార్త:**
మండల పరిధిలోని పడమటికోన గ్రామం బోడిరెడ్డి గారి పల్లె సచివాలయంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడ శాఖామాత్యులు రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ రామాంజులు మండల టిడిపి నాయకుడు మూగి రెడ్డప్ప మాట్లాడుతూ రైతులకు ఎటువంటి భూ సమస్యల ఉన్న రెవెన్యూ సదస్సు దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులు సమస్యను ఈ సదస్సులో ప్రస్తావించినట్లయితే అధికారుల సమక్షంలో త్వరితగతిన పరిష్కరించుకోవచ్చు అన్నారు. పడమటి కోన గ్రామంలోని ప్రతి రైతు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల రెవిన్యూ అధికారులు, టీడీపీ నాయకులు పెద్దిరెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు శ్రీనివాసులు, టీడీపీ కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పనులు పూర్తయితే ఐదు డివిజన్‌లోని 20వేల మందికి రవాణా సౌకర్యం



**కడప కార్పొరేషన్ మార్చి 11 ప్రభాతవార్త:**
కడప నగర అభివృద్ధిలో భాగంగా మరో కీలక అడుగు పడింది. 21వ డివిజన్ టిడిపి ఇన్చార్జి రాణి ఆధ్వర్యంలో సి.పి. బ్రౌన్ గ్రంథాలయం సమీపంలో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి బుధవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సిసి రోడ్డు ఆర్‌ఓబి పనులు పూర్తి చేయడం ముఖ్యమన్నారు. ఈ ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే 15, 16, 17, 19, 21వ డివిజన్లలోని దాదాపు 20,000 మంది జనాభాకు నేరుగా రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. గతంలో రైలు వచ్చే సమయంలో ఇక్కడ గంటల తరబడి ట్రాఫిక్‌లో ఆగిపోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ రోడ్డు పనులు పూర్తయితే ఎక్కడా ట్రాఫిక్ జామ్ లేకుండా సజావుగా ప్రజలందరు రింగ్ రోడ్డుకు చేరుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ రాకేష్ చంద్ర, ఏ ఈ ప్రతాప్ రెడ్డి, టిడిపి డివిజన్ కన్వీనర్ రంజిత్, టిడిపి నాయకులు గోవర్ధన్ రెడ్డి, రెడ్డయ్య, కార్పొరేటర్లు సుబ్బారెడ్డి, శివ కోటిరెడ్డి, రామ లక్ష్మణ్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, అనురాధ, రోజా, శ్రీలేఖ, కృష్ణవేణి, మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలి

### డిడిఈఓ లోకేశ్వర్ రెడ్డి



**తంబళ్లపల్లె, మార్చి 11 ప్రభాతవార్త :**
టెన్త్ విద్యార్థులు రాబోయే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చాలని డివిజనల్ డిప్యూటీ విద్యాశాఖ అధికారి లోకేశ్వర్ రెడ్డి సూచించారు. బుధవారం ఆయన మండలంలోని కోసువారిపల్లి జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి విద్యా ప్రమాణాలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. టెన్త్ విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా పట్టుదల సడలకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా 9వ తరగతి విద్యార్థులకు బ్రిడ్జి కోర్స్‌కు సంబంధించిన విషయాలు తెలియజేశారు. పాఠశాల హెడ్ మాస్టర్‌తో పాటు అధ్యాపక బృందం టెన్త్ విద్యార్థుల విద్యా ప్రమాణాలపై దృష్టి సారించి వారి సమస్యలను పరిష్కరించి ఉత్తమ ఫలితాలు సాధనకు సహకరించాలన్నారు. ఆయన వెంట హెడ్మాస్టర్ నందకుమార్ మరియు అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## పులివెందుల అర్బన్ సి.ఐ శ్రీ రామ్‌కి అభినందనలు తెలిపిన బీజేపీ నాయకులు



**పులివెందుల,మార్చి 11, ప్రభాతవార్త :**
పులివెందుల అర్బన్ సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీరామ్‌ను ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ వంగల శశి భూషణ్ రెడ్డి, పులివెందుల మండల అధ్యక్షులు వై. నవీన్‌లు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు సంపూర్ణ రామాయణం గ్రంథాన్ని సి.ఐ. శ్రీరామ్‌కి బహుమతిగా అందజేశారు. అనంతరం పులివెందుల పట్టణం మరియు మండల పరిధిలో నెలకొన్న స్థానిక సమస్యలను సి.ఐ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అలాగే పులివెందులలో శాంతి భద్రతలు కాపాడుతూ, పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. గ్రామాల్లో ఏర్పడుతున్న సమస్యలను సమయానికి పరిష్కరించి అవి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. పులివెందుల మండల పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యలను చక్కదిద్దాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మహేశ్వర్ రెడ్డి, లక్ష్మయ్య, శ్రీరాములు, తిరుపాల్ రెడ్డి, వాజ్పేయి, యుగంధర్ పాల్గొన్నారు.

## నేడే తంబళ్లపల్లె మండల్ మీట్

**తంబళ్లపల్లె మార్చి 11 ప్రభాతవార్త :**
గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగే మండల సర్వసభ్య సమావేశానికి ప్రోటోకాల్ ప్రకారం ఎంపీపీ శ్యామలా కోటిరెడ్డి తోపాటు జడ్పిటిసి, మండలంలోని 11 మంది ఎంపీటీసీలు, 21 మంది సర్పంచులు, కోఆప్షన్ నెంబర్, ప్రత్యేక ఆహ్వానితులు, మండలం లోని అన్ని శాఖల అధికారులతో పాటు టిడిపి తరఫున మండల అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, బేరిశ్రీనివాసులు, పురుషోత్తం,వెంకట్ రెడ్డి, రామచంద్రారెడ్డి, అల్లావుద్దీన్ లకు అనుమతి ఇవ్వాలని ఎంపీడీవో బాపూజీ పట్నాయక్, ఏవో థామస్ రాజా కు టిడిపి నేతలు వినతి పత్రం యిచ్చారు. ఆయన ఆమోదించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత ఉపాధ్యక్షుడు నరసింహులు, వీరాంజనేయులు, సుధాకర్, సురేంద్ర, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

### సర్వేలు, లక్ష్యాలు, విధుల భారం తగ్గించాలి, ఆర్డీవో వినతిపత్రం అందచేసిన ఉద్యగులు

**పులివెందుల, మార్చి 11, ప్రభాత వార్త :**
గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పులివెందుల తాలూకాలోని ఉద్యోగులు బుధవారం ఆర్డీవో చిన్నయ్యకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తాలూకా అధ్యక్షుడు మరియు పులివెందుల సంయుక్త కార్యాచరణ సమితి అధ్యక్షుడు గజ్జల జగన్నాథ రెడ్డి నాయకత్వంలో ఉద్యోగులు రెవెన్యూ డివిజనల్ అధికారి చిన్నయ్యను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు అనేక రకాల సర్వేలు, లక్ష్యాలు, బూత్ స్థాయి అధికారుల విధులు మరియు ఇతర పనుల భారంతో ఇబ్బందులు ఎదురవుతు న్నాయని తెలిపారు. ఈ సమస్యలపై సమగ్రంగా వివరించి వినతిపత్రం అంద జేశారు. దీనిపై రెవెన్యూ డివిజనల్ అధికారి చిన్నయ్య సానుకూలంగా స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిశీలించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా పట్టణ కమిషనర్ కార్యాలయం మరియు తహసీల్దార్ కార్యాలయంలో కూడా ఉద్యోగులు తమ సమస్యలపై ప్రతినిధుల ద్వారా వినతిపత్రాలు అందజేశారు.



ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడు గుజ్జల జగన్నాథ రెడ్డికి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులివెందుల నియోజక వర్గంలోని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి పన్నులు చెల్లించి అభివృద్ధికి బాటలు వేయండి ఎంపిడిఓ లతీఫ్ ఖాన్




**రామసముద్రం మార్చి11 ప్రభాతవార్త :**
ప్రభుత్వానికి ప్రజలు పన్నులు చెల్లించి మండల అభివృద్ధి కి బాటలు వేయండని ఎంపిడిఓ లతీఫ్ ఖాన్, డిప్యూటీ ఎంపిడిఓ కృష్ణవేణి అన్నారు. మండలంలోని ఊలపాడు పంచాయతీ నరసాపురం గ్రామంలో పర్యటించి ఇంటి పన్నులు వసూలు చేశారు. పంచాయతీల అభివృద్ధి పన్నుల వసూళ్లపై ఆధారపడి ఉంటుందన్నారు, ప్రతి ఒక్కరూ సకాలంలో పన్నులు చెల్లిస్తే వారికి అపరాధ రుసుములుండ వన్నారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి పన్నులు చెల్లింపులపై అవగాహన కల్పించారు. అలాగే రాగిమాకులపల్లి గ్రామపంచాయతీ లోని పేడరాజపల్లె, సానిపల్లె, రాగిమాకుల పల్లె గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లు ద్వారా రెండు ట్రై సైకిల్ ద్వారా పొడి చెత్తను సేకరించి ఎస్ డబ్ల్యూ పీసీ సెడ్ తరలించి పొడి చెత్తను వేరుచేసి తడి చెత్తలో వర్మ కంపోస్ట్ వృత్తిని చేయడం జరిగింది. సెడ్ నిర్వహణలో గ్రీన్ అంబాసిడర్లకు సూచనలు అందించారు ఈ కార్యక్రమంలో లతీఫ్ ఖాన్, కృష్ణ వేణి పంచాయతీ సెక్రటరీ చైతన్య గ్రీన్ అంబాసిడర్లు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి మండిపల్లి చూపు

మొదటి పేజీ తరువాయి

మరోవైపు రాష్ట్ర మంత్రిగా అభివృద్ధి వైపు దృష్టి కేంద్రీకరించి పనిచేస్తున్నారు. దేశంలోని విద్యుత్ బస్సులను ఏపీకి అధికంగా మందులు చేసేలా కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. రాష్ట్రంలో కూడా ఆర్టీసీ కనీసం వెయ్యి బసులు కొనుగోలు చేయాలని రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు సీఎంతో కూడా చర్చించి అంగీకారం పొందారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే కొత్త ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలుకు ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు కేంద్రం రాష్ట్రాల వారీగా ఏర్పాటు చేయనున్న ఎలక్ట్రికల్ చార్జింగ్ కేంద్రాలను జాతీయ రహదారులపై విరివిగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదన పంపారు. రహదారులపై ప్రమాదాల నివారణకు రాష్ట్ర బడ్జెట్ సందర్భంగా రోడ్ సేఫ్టీ కోసం 10 శాతం రోడ్ సేఫ్టీ సెస్సును కూడా వసూలు చేయాలని తీసుకున్న నిర్ణయం ప్రమాదాలు నివారణకు రహదారుల అభివృద్ధికి దోహదపడుతుంది. ఇకపోతే స్థానిక సంస్థల ఎన్నికలు మంత్రిగా మండిపల్లికి నియోజకవర్గం లో విజయం నల్లేరు మీద నడక కాదు. అందుకే అభివృద్ధిపై దృష్టి సారించారు. మరోవైపు రెండేళ్ల క్రితం సీఎం రాయచోటి పర్యటనలో పార్టీ పరిస్థితి , ప్రధానంగా క్షేత్రస్థాయిలో పరిస్థితి పై పార్టీ సమావేశంగా హెచ్చరిక చేశారు. మొన్నటి వరకు అంతా తానే నియోజకవర్గాన్ని నడిపారు. తాజాగా పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులుగా సుగవాసి ప్రసాద్ బాబు ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఇద్దరు కలిసి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంటే ఇద్దరు సమన్వయంతో పనిచేస్తేనే స్థానిక ఎన్నికల్లో దీటైన జవాబు ఇవ్వగలరు. ప్రస్తుతం నియోజకవర్గంలో పార్టీ క్షేత్రస్థాయిలో పరిస్థితి పైకి కనిపించ స్థాయిలో బలంగా లేదన్నది పార్టీ అధిష్టానవద్ద ఉన్న నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రగతి,పరిపాలనతో పాటు పార్టీ అభివృద్ధిని సాధించడం మంత్రిగా సవాల్ అని చెప్పవచ్చు. మరో వైపు జిల్లా ఇన్చార్జి మంత్రిగా చిత్తూరు జిల్లాలో కూడా మండిపల్లి దూసుకుపోతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో అభివృద్ధి కూడా కీలకమయ్యాయి. సీఎం సొంత జిల్లా కావడంతో చిత్తూరు జిల్లా పై కూడా మంత్రి దృష్టి సారిస్తున్నారు. ప్రగతి పరిపాలన అభివృద్ధిని సమన్వయం చేసుకోవడంలో మంత్రి అంకితభావానికి రానున్న మంత్రివర్గ విస్తరణ కీలకం కానుంది.

## మురికి కాలువల్లో పూడికతీత

**దువ్వూరు, మార్చి 11, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన దువ్వూరులోని మురికి కాలువల్లో పేరుకు పోయిన పూడికతీతను బుధవారం తొలగించారు. ఇటీవల దువ్వూరు పోలీస్ స్టేషన్ సమీపంలోనూ, జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద అలాగే పలుచోట్ల మురికి కాలువల్లో పూడిక పేరుకొని పోవడంతో నీరు పోయేందుకు వీలు లేకుండా పోయింది. దీన్ని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో బుధవారం జెసిబితో తొలగించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద అలాగే సమీపంలో ఉన్న అంగన్వాడీ కేంద్రం దువ్వూరు పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న పూడికను జెసిబితో తొలగించారు. ఈ విషయంపై ఎంపీడీవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ త్వరలో 10వ తరగతి పరీక్షలు మొదలవుతున్నందున హైస్కూల్ వద్ద మురికి నీరు చేరి ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడతారనే ఉద్దేశంతో వీటిని తొలగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రాయుడు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కల సంరక్షణపై విద్యార్థులకు ఆచరణాత్మక అవగాహన




**పులివెందుల, మార్చి 11, ప్రభాతవార్త :**
వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలోని ఆంధ్రప్రదేశ్ సామాజిక సంక్షేమ నివాస పాఠశాల సీవీఎస్ఆర్ భవన్‌లో కౌశల్ బోధ్ కార్యక్రమంలో భాగంగా 6, 7 మరియు 8వ తరగతుల విద్యార్థులకు నర్సరీ సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మొక్కలు నాటడం, వాటి సంరక్షణ మరియు నీటిపారుదల విధానాల గురించి వివరించారు. నర్సరీలో ఉపయోగించే పరికరాలు, మొక్కలు నాటడంలో అనుసరించే విధానాలను విద్యార్థులకు చూపిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహనతో పాటు ఆచరణాత్మక జ్ఞానాన్ని కూడా పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కౌశల్ బోధ్ కార్యక్రమంలో భాగంగా వృత్తి శిక్షకురాలు అన్నారెడ్డి వనజ విద్యార్థులను నర్సరీకి తీసుకెళ్లి అక్కడ జరుగుతున్న పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీనివాస రెడ్డి తో పాటు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నగిరిగుట్టలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల మెరుపు దాడులు

**పులివెందుల, మార్చి 11, ప్రభాతవార్త :**
కడప జిల్లా పులివెందుల పట్టణ పరిధిలోని నగిరిగుట్ట ప్రాంతంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై పులివెందుల పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. కోడి పందాలు మరియు నక్క ముట్టి నిర్వహిస్తున్న స్థావరాలపై సీఐ శ్రీరామ్, ఎస్సై తిమోతి, ఎస్సై మధుసూదన్ రెడ్డి తమ పోలీస్ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఈ దాడుల్లో కోడి పందాల వద్ద నుంచి రూ.2,000, నక్క ముట్టి వద్ద నుంచి రూ.7,900 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో దాదాపు 15 మందికి పైగా వ్యక్తులను అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ నిర్వహించి అనంతరం కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా పులివెందుల సీఐ శ్రీరామ్ మాట్లాడుతూ పేకాట, కోడి పందాలు, నక్క ముట్టి, నాటు సారా విక్రయం, అలాగే ఆరుబయట మద్యం సేవించడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. ప్రజలు చట్టాన్ని గౌరవిస్తూ శాంతిభద్ర తలను కాపాడేందుకు సహ కరించాలని కోరారు. ఈ దాడుల్లో అర్బన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో 33 స్మార్ట్ కిచెన్‌లను ఒక మాసం లోపు పూర్తి చేస్తాం : జిల్లా కలెక్టర్

**కడప,మార్చి 11 ప్రభాతవార్త**
యూరియా వినియోగాన్ని తగ్గించేందుకు ప్రోత్సాహకంగా నానో యూరియాను ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరుగుతున్న ఆరవ జిల్లాల కలెక్టర్ల సదసులో తొలి రోజు కలెక్టర్ల సమావేశంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాలు, పది సూత్రాలు,స్వచ్ఛాంధ్ర, జీఎస్డీపీ లక్ష్యాలు, జిల్లాలలో విజయ వంతమైన కార్య క్రమాలపై సమీక్షతోపాటు పీపీపీ ప్రాజెక్టులు, ఆర్టీజీఎస్, సుపరిపాలనలో సాంకేతికత, పెట్టుబడులు,వైద్యారోగ్యం, సూపర్ సిక్స్ పథకాలపై ముఖ్యమంత్రి చర్చించారు. ఈ సందర్భంగా వైయస్సార్ కడప జిల్లాలో వ్యవసాయ రంగంలో వినూత్నంగా అమలు చేస్తున్న ఛీఛీఛాంపియన్ రైతుల ఎంపిక విధానము, స్మార్ట్ కిచెన్‌ల పురోగతిని గురించి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ముఖ్యమంత్రికి వివరించారు. వై ఎస్ ఆర్ కడప జిల్లా వ్యాప్తంగా 361 రైతు సేవా కేంద్రముల నుండి 361 రైతులను ఆయా గ్రామములో ఎక్కువగా పండించే పంటలో నైపుణ్యం ఉండే రైతులను ఆదర్శ రైతులుగా (ఛాంపియన్)గా గుర్తించి వారి ద్వారా ఆ గ్రామంలోని మిగిలిన రైతులకు పంటల మీద,వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబందించిన కార్యక్రమాలపై అవగాహన కల్పించడం జరుగుచున్నదని,వీరు అన్ని శాఖల అధికారులకు గ్రామంలోని ఇతర రైతులకు అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి గారు వివరించారు. స్మార్ట్ కిచెన్ వైఎస్ఆర్ కడప జిల్లాలో దేశంలోనే మొదటిసారిగా స్మార్ట్ కిచెన్ విధానం ద్వారా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన రుచికరమైన భోజనం ను అందించేందుకు కడప జిల్లాలో అమలు చేస్తున్న స్మార్ట్ కిచెన్ కు సంబంధించి 33 స్మార్ట్ కిచెన్ లను ఒక మాసం లోపు పూర్తి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ముఖ్యమంత్రికి వివరించారు.

# రాజకీయంగా ఎదుర్కోలేక కక్ష సాధింపు:వంకెల పెద్ద పోలిరెడ్డి

**బద్వేలు, మార్చి 11, ప్రభాతవార్త :**
బద్వేలు జడ్పీటీసీ చిన్న పోలి రెడ్డి పై నమోదైన కేసు అక్రమమని, దీనిపై న్యాయస్థానంలో పోరాటం చేస్తామని ఆయన సోదరుడు పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వంకెల పెద్ద పోలి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బద్వేల్లోని తమ స్వగృహంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల క్రితం తమ సోదరుడు చిన్న పోలి రెడ్డిని ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం తీవ్రంగా ఖండించామన్నారు. పోలీసుల నమోదు చేసిన కేసులో 2010-2011 సంవత్సరాల్లో తమ సోదరుడు సహకార సంఘం అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఐసీడీపీకి సంబంధించిన నిధుల్లో రూ.34 లక్షల అవినీతి జరిగిందని పేర్కొనడం జరిగిందని తెలిపారు. అయితే 2014 నుండి 2019 వరకు తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో తాము తప్పు చేసి ఉంటే అప్పుడే చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. అదే విధంగా 2019 నుండి 2024 వరకు తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కూడా ఈ విషయాన్ని తాము మేనేజ్ చేసుకునే అవకాశం ఉండేదని అన్నారు. ప్రస్తుతం తమపై ఫిర్యాదు చేసిన సీఈఓ మహేష్ కుమార్ గతంలో చేసిన అవకతవకలను గుర్తించి తమ ప్రభుత్వంలో ఆయనను సీఈఓ పదవి నుంచి క్లర్క్‌గా తగ్గించినట్టు తెలిపారు. అదే వ్యక్తిని కొంతమంది నాయకులు ప్రలోభాలకు గురిచేసి తమపై తప్పుడు ఫిర్యాదు చేయించారని ఆరోపించారు. ఒక అవినీతి ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేయడం హాస్యాస్పదమని అన్నారు. తమ రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఆమె కుమారుడు రితేష్ రెడ్డి కలిసి కుట్రపన్ని తమపై అక్రమ కేసులు



పెట్టించి రిమాండ్‌కు తరలించారని ఆరోపించారు. బద్వేలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తమకు బలమైన మద్దతు ఉన్నందున స్థానిక ఎన్నికల ముందు తమను ఆర్థికంగా, రాజకీయంగా బలహీనపర్చడానికి ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. తమకు ఎదురైన ఈ పరిస్థితుల్లో తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ కుటుంబానికి అండగా నిలిచారని తెలిపారు. వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. తమపై నమోదైన ఈ కేసు అక్రమమని పేర్కొంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయం సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని వంకెల పెద్ద పోలి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయరామిరెడ్డి కౌన్సిలర్ ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ పి గ్యాస్ సిలిండర్‌లకు కొరత లేదు

### డీలర్ గబ్బురి మధుసూదన్ శెట్టి



**రామసముద్రం మార్చి 11 ప్రభాతవార్త:**
రామసముద్రం మండల కేంద్రంలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర హెచ్‌పి గ్యాస్ గ్రామీణ విత్రక్‌లో గ్యాస్ సిలిండర్ల కొరత లేదని ఏజెన్సీ సిబ్బంది తెలిపారు. వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్న వెంటనే ఓటీపీలు వస్తున్నాయని, ఓటీపీ వచ్చిన వారందరికీ సకాలంలో గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. కష్టమర్లు ఎవరూ అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని, అవసరమైన మేరకు గ్యాస్ సిలిండర్ల స్టాక్ అందుబాటులో ఉందని ఏజెన్సీ డీలర్ గబ్బురి మధుసూదన్ శెట్టి సిబ్బంది స్పష్టం చేశారు.

## మేము సైతం అంటూ పెరటి తోట సాగులో విద్యార్థులు

### స్పెషల్ ఆఫీసర్ అమరనాథ్ రెడ్డి



**తంబళ్లపల్లె మార్చి 11 ప్రభాతవార్త :**
తంబళ్లపల్లె మోడల్ స్కూల్లో ప్రకృతి వ్యవసాయ సాగులో భాగంగా పెరటి తోట పెంపకంలో విద్యార్థుల సహకారం ప్రశంసనీయమని స్పెషలాఫీసర్ అమరనాథ్ రెడ్డి కొనియాడారు. బుధవారం ఆయన మోడల్ స్కూల్ సందర్శించి పెరటి తోటలో విద్యార్థులు విరామ సమయంలో కలుపు తీయడం గమనించి అభినందించారు. విద్యార్థులు విద్యతోపాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు, పెరటి తోట పెంపకం పనులు చేపట్టడంతో వారిలో క్రమశిక్షణ, చైతన్యం, ఆరోగ్యం, పర్యావరణం, ప్రకృతి వ్యవసాయం పై అవగాహన, మానసిక ఉల్లాసం పెంపొందుతాయని సూచించారు. విద్యార్థులు నడవడికపై శ్రద్ధ చూపిస్తున్న ప్రిన్సిపల్ హేమంత్ కుమార్, అధ్యాపకులు, సిబ్బందిని అభినందించారు. ఆయన వెంట అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ సభ్యత్వం నమోదు పొడిగింపు




**ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 11, ప్రభాతవార్త ;**
జనసేన పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని పొడిగించడం జరిగిందని జనసేన పార్టీ నాయకులు మాదాసు మురళి తెలిపారు. జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీకి సంబంధించిన సభ్యత్వ నమోదు మార్చి 17 వరకు పార్టీ నాయకత్వం పొడిగించడం జరిగిందని ప్రతి ఒక్కరూ సభ్యత్వని నమోదు చేసుకోవాలని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో మన ప్రొద్దుటూరు నియోజకవర్గంలో నిలపాలని ఆయన కోరారు. ఈ సభ్యత్వం చేసుకోవడం వలన సభ్యులకి సాధారణ మరణం జరిగితే లక్ష రూపాయలు, యాక్సిడెంట్లు రూపంగా అంగవైకల్యం చెందుతే రెండున్నర లక్ష, ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ రూపంలో మరణిస్తే 5 లక్షల రూపాయలు వచ్చేవిధంగా బీమా చేయించి వారి కుటుంబానికి ఆసరాగా నిలబడుతుందని తెలిపారు. సభ్యత్వాన్ని నందిని క్లాత్ మార్కెట్ లోగల జనసేన పార్టీ కార్యాలయంలో నిరంతరం జరుగుతుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో ఏ నాయకుడు చేయని విధంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారు సేవలు అందిస్తున్నారని మరిన్ని సేవలు చేసే దానికి మనము చేసుకున్న పార్టీ సభ్యత్వంతోనే ఆయనకు సహకారం అందించినట్లు అవుతుందన్నారు. ప్రస్తుత తరుణంలో పవన్ కళ్యాణ్ గారి నాయకత్వం బలపరిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధిషగా పయనిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జన సైనికులు అల్లం చంద్రశేఖర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నా, సాగునీటి పనులు అడుగు ముందుకు పడలేదు

### సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ధ్వజం



**మదనపల్లి మార్చి 11 ప్రభాతవార్త**
రాయలసీమలో ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో వాస్తవాలకు దూరంగా ఉన్నాయని సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల విషయంలో అనుసరిస్తున్న తీరుపై మండిపడ్డారు. ముఖ్యమంత్రి ప్రతి ఎకరాకు నీరిస్తామని చెబుతున్నప్పటికీ, అన్నమయ్య జిల్లాలోని హంద్రీనీవా కాలువ పనులు, వెలిగల్లు ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిధులు ఎందుకు కేటాయించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సమయంలోనూ, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని చెప్పడం కేవలం రాజకీయ ప్రచారానికే పరిమితమైందని, ఆచరణలో శూన్యమని శ్రీనివాసులు విమర్శించారు. కాలువల మరమ్మతులు లేక, నిధులు అందక సాగునీరు అందక రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకుల వలెనే ప్రస్తుత ప్రభుత్వం కూడా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, పెండింగ్ పనులకు ప్రత్యేక నిధులు కేటాయించి, పనుల పురోగతిని పర్యవేక్షించాలని, కాలువల మరమ్మతులు చేపట్టి, చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. “సీమ రైతాంగంపై ప్రభుత్వానికి నిజమైన ప్రేమ ఉంటే, మాటలతో సరిపెట్టకుండా వెంటనే పనులు పూర్తి చేసి నీరు విడుదల చేయాలని, లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం“ అని హెచ్చరించారు.

## రైల్వే స్టేషన్లో పలు రైళ్లు ఆపాలని రైల్వే మంత్రిని కోరిన ఎంపీ



**ముద్దనూరు,మార్చి11 ప్రభాతవార్త:**
ముద్దనూరు రైల్వే స్టేషన్ లో పలు రైళ్లను ఆపాలని బుధవారం ఢిల్లీలోని రైల్వే మంత్రి కి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని పలు రైల్వే సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ముద్దనూరు రైల్వే నిలయంలో కాచిగూడ పుదుచ్చేరి, కడప గుంతకల్ స్పెషల్ ట్రైన్ లను నిలపాలని రైల్వే మంత్రిని కోరారు. ముద్దనూరు పులివెందుల వరకు నూతన రైల్వే లైన్‌కు అనుమతులు ఇచ్చి త్వరగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు.

## హెచ్‌పివి టీకా మహిళలకు ఒక వరం

**బద్వేల్ మార్చి 11 ప్రభాతవార్త:**



హెచ్‌పివి టీకాతో మహిళలకు గర్భాశయ ముఖ క్యాన్సర్ నివారణ భవిష్యత్తులో రాకుండా ఉండేందుకు గురువారం టీకాలు వేయడం జరుగుతుందని, 14 నుండి 15 సంవత్సరాల బాలికలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, తొట్టిగారిపల్లె వైద్యాధికారి రాజేష్‌కుమార్ అన్నారు. బద్వేల్ మండలంలో లక్ష్మీపాలెం హైస్కూలులో బుధవారం విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో సమావేశం జరిగింది. ఈ టీకా వల్ల భవిష్యత్తులో క్యాన్సర్ వచ్చే అవకాశం లేదని, వైద్య బృందం వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు రాజేష్ కుమార్, వినయ్‌కుమార్లు మాట్లాడుతూ ఈ టీకా మహిళలకు ఒక వరం లాంటిదన్నారు. అర్హత కలిగిన ప్రతి బాలిక టీకాను వేయించుకోవాలన్నారు. ఈ టీకాను వేయించుకోవాలన్నా, వారు తప్పక ఆధార్ కార్డును వెంట తీసుకొని రావాలన్నారు. ఈ టీకాలు వేయించుకొని సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ భారతి, హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్దన్ రావు, వైద్య సిబ్బంది సిహెచ్ఓ శిరీష, ఏఎన్ఎం నాగలక్ష్మి, లక్ష్మీనారాయణమ్మ, ఆశ ఈశ్వరమ్మ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## టిడిపి మండల అధ్యక్షుడు రాజారెడ్డి భార్య మృతి

**పోరుమామిళ్ల రూరల్, మార్చి 11 ప్రభాతవార్త:**

కాశి నాయన మండలం టిడిపి అధ్యక్షుడు మురుకుటి రాజారెడ్డి సతీమణి సులోచనమ్మ అకస్మాత్తుగా మరణించారు. విషయం తెలుసుకున్న బద్వేల్ టిడిపి ఇన్చార్జ్ రితీష్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆమె పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజారెడ్డిని పరామర్శించి వారికి మనోధైర్యాన్ని చెప్పారు. వారితోపాటు టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సీతా వెంకటసుబ్బయ్య, బి .కోడూరు మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, స్థానిక టిడిపి నాయకుడు ఉన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పరీక్షా సామాగ్రి వితరణ

**లక్కిరెడ్డిపల్లి: మార్చి 11 ప్రభాతవార్త**



ఈ నెల 16వ తేదీ నుంచి జరగబోయే పదవ తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో దాత క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పి ఎస్ హరినాధ రెడ్డి సహకారంతో లక్కిరెడ్డిపల్లి మండలం దేవలంపల్లి జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులను అందించినట్లు అధ్యక్షులు లయన్ శ్యామ్ తెలియజేశారు. ఈ సందర్భంగా దాత లయన్ పి ఎస్ హరినాద్ రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రీజన్ ఛైర్మన్ లయన్ మహమ్మద్, కోశాధికారి లయన్ మనోహర్ రాజు, పాఠశాల పిడి రెడ్డయ్య, హరి పాపులర్ షూ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా అధ్యక్షురాలికి అవార్డు ప్రధానం

**ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 11, ప్రభాతవార్త**



న్యూఢిల్లీలో ప్రధానమంత్రి మోడీ చేపట్టిన వికాసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నేషనల్ ఛైర్మన్ సుబీర్ పాల్ నేషనల్ జనరల్ సెక్రెటరీ హేమా హెక్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ సందర్భంగా అన్ని రాష్ట్ర లా నుంచి వచ్చిన మహిళా ప్రెసిడెంట్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎంఎస్ఎంఈ మహిళా ప్రెసిడెంట్ ఆసం మీరా కళ్యాణి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలని సద్వినియోగం చేసుకోవాలని. మేకింగ్ ఇండియా ఎంఎస్ఎంఈ రుణాల ద్వారా ప్రతి ఒక్క ఎస్సీ, ఎస్టీ, బిసి మహిళలు పారిశ్రామిక వేత్తలు కావాలని వివరించారు. ఈమెకి 2026 వికాసిత్ భారత్ అవార్డు కేంద్ర మంత్రులు ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నేషనల్ ప్రెసెంట్ చేతుల మీదుగా మీరా కళ్యాణి అవార్డు అందుకున్నారు.

## 16న అంగళ్లులో వేలం పాటలు

**కురబలకోట మార్చి 11 ప్రభాతవార్త**

కురబలకోట మండలంఅంగళ్ళు గ్రామపంచాయతీకి చెందిన టమేటా మార్కెట్, గొర్రెల సంత, కూరగాయల సంతలను 20-26, 20-27 ఆర్థిక సంవత్సరానికి బహిరంగ గుత్త వేలంపాటలను ఈనెల 16న ఉదయం 11 గంటలకు స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు గ్రామ సెక్రెటరీ టి .ఉదయ్ కుమార్, సర్పంచ్ పోరెడ్డి విశ్వనాథరెడ్డి సంయుక్తంగా ప్రకటనలో తెలిపారు. వేలంపాటలలో పాల్గొనే గుత్తేదారులు ముందుగా డిపాజిట్లు చెల్లించవలసిందిగా గ్రామ సెక్రెటరీ ఉదయ్ కుమార్ కోరారు.

## సేల్స్ టాక్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ

**రామసముద్రం మార్చి 11 ప్రభాతవార్త**



మండలంలో వ్యవసాయ ఉద్యాన మరియు సేల్స్ టాక్స్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మల్చింగ్ షీట్ ప్రస్తుతం టమాటో పంట సాగుకు అవసరమైన ముఖ్యమైన వస్తువు కనుక కొన్ని షాపుల యజమానులు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న సమాచారం తెలుసుకొని సేల్స్ టాక్స్ అధికారులు ఉమ్మడిగా తనిఖీ చేశారు. షాపు యజమానులతో మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని షాపులలో పాత స్టాకు మాత్రమే ఉన్నది కావున పాత స్టాక్ అయిపోయే వరకు పాత రేట్లకే మల్చింగ్ పేపర్ అమ్మకాలు జరగాలని తెలియజేశారు. అలాగే ప్రతి ఒక్క రైతు మల్చింగ్ షీట్ కొనే షాపులలో జీఎస్టి బిల్లు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఇంకనూ ఏ షాపు యజమానులైనా అధిక ధరలకు అమ్మిన లేదా జి యస్ టి బిల్లులు ఇవ్వకున్నా రైతులు నేరుగా మండల వ్యవసాయ, ఉద్యాన లేదా సేల్స్ టాక్స్ అధికారులను తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి ఉద్యాన అధికారి ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి, వ్యవసాయ అధికారి జాఫర్, అసిస్టెంట్ సేల్స్ టాక్స్ ఆఫీసర్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో సమృద్ధిగా యూరియా

**జిల్లా వ్యవసాయఅధికారి శివనారాయణ**

**మదనపల్లె, మార్చి 11 ప్రభాతవార్త :**



జిల్లాలో 2025-26 సీజన్‌కు సంబంధించి అన్ని పంటలకు అవసరమైన యూరియా సంవృద్ధిగా ఉందని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో అన్ని పంటలకు అవసరమైన 18071మెట్రిక్ టన్నుల యూరియా ఎరువు పంపిణీకి ప్రణాళిక చేయబడిందన్నారు. రైతుల కోసం 24075 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎటువంటి ఎరువుల కొరత లేదన్నారు. నేటినుంచి 21రోజులుకు గానూ 2614 మెట్రిక్ టన్నులు అవసరం కాగా ప్రసుత్తం 5274 మెట్రిక్ టన్నులు యూరియాను కోఆపరేటివ్ సొసైటీల్లో, మార్కెట్‌ఫెడ్ గోదాముల్లో రైతులకు ఎరువును అందుబాటులో ఉంచామన్నారు. రాబోయే పంట కాలంలో కూడా యూరియాకు ఎటువంటి కొరత లేదన్నారు. నూతనంగా రూపొందించబడిన సాంకేతిక అభివృద్ధి పరిచిన నానో యూరియా, నానో డిఏపి ఎరువులను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. సాంప్రదాయ ఎరువులకు 100శాతం ప్రత్యామ్నాయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని ప్రోత్సహిస్తున్నాయన్నారు. రైతు సోదరులు ఎరువులను కొనుగోలు చేసేటప్పుడు బస్తాపై ముద్రించిన ఎంఆర్‌పి ధరలను చూసుకొని దాని ప్రకారమే చెల్లించి డీలర్ నుంచి రశీదు పొందాలన్నారు. డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

**చాపాడు. మార్చి 11 ప్రభాతవార్త :**



చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవనిరూరల్ సీఐ శివశంకర్ యాదవ్ హెచ్చరించారు. మండలంలోని చిన్న వరదాయపల్లిగ్రామం నందు డి.ఎస్.పి రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో వజ్రప్రహార్, కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాత నేరస్తులు, అనుమానితుల ఇళ్లలో మారణాయుధాల సోదాలతోపాటు, రికార్డులు లేని 13 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంతోపాటు, అనుమానితుల సమాచారాన్ని డయల్ 112 ద్వారా పోలీసులకు సమాచార ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు అర్బన్ సీఐ రమణారెడ్డి, ఖాజీపేట, సిఐ వంశీధర్, చాపాడుఎస్సై చిన్న పెద్దయ్య, అర్బన్ ఎస్ఐ కత్తి వెంకటరమణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 13న మండల సర్వసభ్య సమావేశం

**గాలివీడు, మార్చి 11 ప్రభాతవార్త:**

ఈ నెల 13వ తేదీన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ పేర్కొన్నారు. ఈ సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులతో పాటు శాఖలకు చెందిన అధికారులందరూ పాల్గొనాలని తెలిపారు.

## పదో పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం

**మండలంలో 5 పరీక్షా కేంద్రాలు - 650 మంది విద్యార్థులు హాజరు**

**నందలూరు, మార్చి 11 ప్రభాతవార్త :**



పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. మండల పరిధిలోని 17 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 650 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షలను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు ఆయా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లను నియమించారు. పరీక్షా కేంద్రాలను నిరంతరం తనిఖీ చేసేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, పారిశుద్ధం, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్, విద్యుత్ సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. పరీక్షా కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్‌లుగా గుర్తించి, కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 144 అమల్లో ఉంటుందన్నారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని ఎంఈఓ ఆకాంక్షించారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**పీలేరు, మార్చి 11 ప్రభాతవార్త:**



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో

గ్రామ సచివాలయాల్లోని సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని ఎంపీడీవో శివశంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఐదు గ్రామ సదివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వచ్చిన ఆర్జీలు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సిబ్బంది తప్పక సమయపాలన పాటించాలన్నారు. సిబ్బంది వెలుపలకి వెళ్లేటప్పుడు మూమెంట్ రిజిస్టర్లో విధిగా రాసి వెళ్లాలని తెలిపారు. కొందరు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని ఫిర్యాదులు విస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయాధికారి. దొరస్వామి. ప్రసాద్ పాల్గొన్నారు.

## రెండు స్కూటర్లు ఢీ : ఇద్దరికి గాయాలు

**చౌడేపల్లి, మార్చి 11 ప్రభాతవార్త**



రెండు స్కూటర్లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలపాలైన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. చౌడేపల్లి-పుంగనూరు ప్రధాన రహదారిలో బిల్లేరు గౌడిండ్లు వద్ద ఇరువైపుల నుంచి వస్తున్న రెండు స్కూటర్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పులిచర్ల మండలం కల్లూరుకు చెందిన భాను ప్రకాష్(21), సోమల మండలం ఇరికిపెంట బంగ్లా మునిరామయ్య(51)లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వీరిని స్థానికులు సహకారంతో 108సేవల ద్వారా మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## గర్భకోశ క్యాన్సర్ నిర్మూలనకు హెచ్‌పివి వ్యాక్సీన్

**చౌడేపల్లి, మార్చి 11 ప్రభాతవార్త**



వ్యాక్సీన్‌లు వేయిస్తున్న అధికారులు

బాలికల్లో గర్భకోశ క్యాన్సర్‌ను అరికట్టేందుకు హెచ్‌పివి వ్యాక్సీన్ ఉపయుక్తంగా వుంటుందని మండల వైద్యాధికారి మోనా అన్నారు. ఇటీవల ప్రభుత్వం గర్భకోశ క్యాన్సర్ నిర్మూలనకు హెచ్‌పివి వ్యాక్సీన్ ప్రక్రియను ప్రారంభించింది. ఈక్రమంలో బుధవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) వ్యాక్సీన్‌లను వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళలు గర్భస్థక్యాన్సర్ బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకొంటోందన్నారు. గతంలో ఈ వ్యాక్సీన్ వేసుకొనేందుకు అధిక ఖర్చుతో కూడుకొనేదనీ, ప్రస్తుతం ప్రభుత్వం ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందిస్తోందన్నారు. 14యేళ్ళు నిండిన ప్రతి బాలిక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని అనుభవించాలన్నారు. మండలానికి 80వ్యాక్సీన్‌లు మంజూరు అయ్యాయన్నారు. అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఆరోగ్య సిబ్బంది, తేదేపా నాయకులు పాల్గొన్నారు.

## గ్రామంలో విస్తృత తనిఖీలు

**గోపవరం, మార్చి 11, ప్రభాతవార్త**



ప్రభుత్వ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు బుధవారం బద్వేలు రూరల్ సీఐ ఆధ్వర్యంలో వజ్రపహార్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ పరిధిలో పోలీసులు విస్తృతంగా తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గోపవరం గ్రామంలోని జగనన్న కాలనీ ప్రాంతంలో ప్రత్యేకంగా ముట్టడి చేసి తనిఖీలు చేపట్టారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీలలో పోలీసులు ఇంటింటికీ వెళ్లి అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేశారు. అదే విధంగా వాహనాలను కూడా ఆపి పత్రాలు పరిశీలిస్తూ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నేరాలను అరికట్టడానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ ఇళ్లను సురక్షితంగా ఉంచుకోవాలని, తెలియని వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వకూడదని సూచనలు చేశారు.గ్రామంలో శాంతి భద్రతలు కాపాడటానికి ఇటువంటి తనిఖీ కార్యక్రమాలు తరచూ కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలోబద్వేలు రూరల్ పోలీసు స్టేషన్ అధికారి, ఉపాధికారులు, అట్లూరు పోలీసు స్టేషన్ ఉపాధికారి మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర శాఖ పరిశోధనపై అవగాహన

**కడప మార్చి 11 ప్రభాతవార్త :**

ప్రభుత్వ పురుషుల కళాశాలలో బుధవారం శాస్త్రం మరియు సాంకేతిక రంగాల్లో జరుగుతున్న తాజా అభివృద్ధిలను విద్యార్థులకు పరిచయం చేయడం మరియు అంతర శాఖ పరిశోధనపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా శాస్త్రంలో ఉద్భవిస్తున్న ధోరణులు అనే అంశంపై వివిధ కళాశాలల నుండి విచ్చేసిన విద్యార్థులకు 5 రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా 3 వ రోజు రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో యోగివేమన విశ్వవిద్యాలయం నుండి విచ్చేసిన రసాయన శాస్త్ర విభాగం ఆచార్యులు డాక్టర్ కే.వెంకటేశ్వర్లు వేస్ట్ బయోమాస్ టు సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ ఎ బినైన్ డిజైన్ స్ట్రాటజీ అనే అంశంపై ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రవికుమార్ మాట్లాడుతూ శాస్త్ర మరియు సాంకేతిక రంగాల్లో స్థిరమైన అభివృద్ధికి దోహదపడే ఆధునిక పరిశోధన విధానాలను అవలంబించాలని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.రమేష్ ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు విద్యార్థుల్లో శాస్త్రీయ ఆసక్తిని పెంపొందించడంతోపాటు పరిశోధన నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిబిటి కోఆర్డినేటర్ డాక్టర్ వై.సావిత్రి, రసాయన శాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పనుల పరిశీలన

**రామసముద్రం మార్చి 11 ప్రభాతవార్త**



మండలంలోని కాప్పల్లె పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను పథాక సంచాలకులు వెంకటరత్నం బుదవారం పరిశీలించారు. మామిడి చెట్లకు తవ్విన పాదులు,సి సి రోడ్డు,గోకులం షెడ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రాబోయే ఏప్రిల్ నుండి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కొత్త రూపంగా వికసిత్ భారత్ జిరామ్ జీ పథకంను అమలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లతీఫ్ ఖాన్, ఏపీవో మాధవి ఆధ్వర్యంలో సిబ్బందికి ఈ పథకం వివరాలు తెలియజేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ పథకం ద్వారా 125 రోజుల ఉపాధి హామీతో పాటు నీటి భద్రత, రైతులకు మేలు చేసే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గతంలో 100 రోజులుగా ఉన్న పనిదినాలను 125 రోజులకు పెంచడం పేద ప్రజలకు మేలు చేస్తుందని చెప్పారు. అనంతరం పథకానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధికి బాటలు వేయండి

**రామసముద్రం మార్చి 11 ప్రభాతవార్త**



ప్రభుత్వానికి ప్రజలు పన్నులు చెల్లించి మండల అభివృద్ధి కి బాటలు వేయండని ఎంపిడిఓ లతీఫ్ ఖాన్, డిప్యూటీ ఎంపిడిఓ కృష్ణవేణి అన్నారు. మండలంలోని ఊలపాడు పంచాయతీ నరసాపురం గ్రామంలో పర్యటించి ఇంటి పన్నులు వసూలు చేశారు. పంచాయతీల అభివృద్ధి పన్నుల వసూళ్లపై ఆధారపడి ఉంటుందన్నారు, ప్రతి ఒక్కరూ సకాలంలో పన్నులు చెల్లిస్తే వారికి అపరాధ రుసుములుండవన్నారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి పన్నులు చెల్లింపులపై అవగాహన కల్పించారు. సెడ్ నిర్వహణలో గ్రీన్ అంబాసిడర్లకు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో లతీఫ్ ఖాన్, కృష్ణవేణి పంచాయతీ సెక్రటరీ చైతన్య గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌లేని సమాజ స్థాపనకే టీకాలు

**పీలేరు మార్చి 11 ప్రభాతవార్త:**



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

క్యాన్సర్ లేని సమాజ నిర్మాణం కొరకే హెచ్‌పివి టీకాలు బాలికలకు ఇస్తున్నట్లు చింతపర్తి ఇంచార్జి వైద్యులు చిన్నారెడ్డెప్ప మరియు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ తెలిపారు. బుధవారం స్థానిక పిహెచ్‌సి. కేంద్రంలో బాలికకు గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ రహిత భవిష్యత్ కోసం ప్రతిష్టాత్మకంగా మన ప్రభుత్వం తలపెట్టిన హెచ్‌పివి టీకా బాలికలకు వేశారు. చింతపర్తి పి. హెచ్.సి పరిధిలో 14 సంవత్సరాల బాలికలను 73 మందిని లబ్ధిదారులగా ఇంటింటి సర్వేద్వారా గుర్తించామని14 సంవత్సరాలు పూర్తయి ఇంకా 15 సంవత్సరాలు పూర్తికాని బాలికలు టీకాలకు అర్హులని మొత్తం జనాభాలో వీరు కేవలం 1 శాతం ఉంటారని,గుర్తించిన బాలికలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రములోనే ఈ టీకా డాక్టర్లు మరియు తల్లిదండ్రుల పర్యవేక్షణలో వేస్తారని, ఈ టీకా పూర్తి సురక్షితమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రము ప్రదాన వైద్యాధికారి డాక్టర్ చిన్న రెడ్డెప్ప మరియు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ తెలిపారు. కార్యక్రమంలో పి.హెచ్.సి వైద్యులు డాక్టర్ చిన్న రెడ్డెప్ప, సి. హెచ్. ఓ అరుణ, డిప్యూటీ హెచ్. ఈ. ఓ మహమ్మద్ రఫీ, పర్యవేక్షకులు భానుబి, స్టాఫ్ నర్స్ లావణ్య, ఫార్మసీ ఆఫీసర్ కరుణ, సీనియర్ ఏ. ఎన్. ఎమ్. హృదఈస్వరి, హెల్త్‌అసిస్టెంట్ వలిసాబ్, ఆశాకార్యకర్తలు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

## హౌసింగ్ నిర్మాణాలను వేగవంతం చేయాలి

**కలికిరి, మార్చి 11, ప్రభాతవార్త:**



మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన హౌసింగ్ ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎండీవో భానుమూర్తిరావు అధ్యక్షతన లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రమేష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పండగకు రాష్ట్రంలో 2లక్షల గృహాలు ప్రారంభించే దిశగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం మంజూరు చేసి వివిధ స్థాయిల్లో ఉన్న ఇంటి నిర్మాణాలు వేగవంతం చేసేందుకు ఎస్సీ, బీసీలకు అదనంగా రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పునాదులు, గోడలు స్థాయిలో ఉన్న లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఉగాదికి నిర్మాణాలు పూర్తి చేయకపోతే ఇళ్లను రద్దు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇవ్వడం జరుగుతుందని ఆయన లబ్ధిదారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ రమణయ్య, ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఇంటి పన్నులు వసూలులో ప్రత్యేక దృష్టి

**కలికిరి, మార్చి 11, ప్రభాతవార్త:**



మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీలో కార్యదర్శి వాసనూరి గంగాదేవి, సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టి గ్రామాల్లో రాత్రి, పగలు సైతం తిరుగుతూ ఇంటింటికి వెళ్లి ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు. ఇప్పటికే పంచాయతీలో 90 శాతం పన్నులు వసూలు చేసి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు పంచాయతీలలో ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలని ఎంపీడీవో భానుమూర్తిరావు, ఈవోఆర్డీ మహ్మద్ రియాజుద్దీన్, డిప్యూటీ ఎంపీడీవో వినయ్‌లు పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్నారు. వారి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి గంగాదేవి, తన సిబ్బందిని అప్రమత్తం చేసి ఉదయం 6 గంటలకే పంచాయతీలకు చేరుకొని గ్రామాల్లో పర్యటిస్తూ ఇంటింటికి వెళ్లి పన్నులు వసూలు చేస్తున్నారు. 90శాతం పన్నులు వసూలు చేయడంతో ఎంపీడీవో భానుమూర్తిరావు, ఈవోఆర్డీ మహ్మద్ రియాజుద్దీన్‌లు పంచాయతీ కార్యదర్శి గంగాదేవిని, సచివాలయ సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ లోగా ఇంటి పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

## మహాభారత యజ్ఞానానికి టీడీపీ నేత విరాళం

**కలికిరి, మార్చి 11, ప్రభాతవార్త:**

కలికిరి-కలకడ రోడ్డు మార్గంలోని మేడికుర్తి క్రాస్ వద్ద జరుగుతున్న మహాభారత యజ్ఞానికి మర్రికుంటపల్లె పంచాయతీ టీడీపీ యువతనేత వాసనూరి పెద్ద వెంకటపతి, ఆయన సతీమణి భాగ్యమ్మలు మహాభారత యజ్ఞానికి రూ.6500 నగదు, భాగవతారిణి ఉషారాణికి పసుపు, కుంకుమ, జాకెట్, రూ.516 నగదు ఇచ్చి తమ దాతృత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నేత వెంకట పతి మాట్లాడుతూ మహాభారత యజ్ఞం వల్ల గ్రామంలోని ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని కార్యక్రమానికి తాను సహాయ సహకారాలు అందించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు.

## గడ్డిమందు త్రాగి కోటపాటి గోపాలయ్య మృతి

**సిద్ధవటం మార్చి11 ప్రభాతవార్త:**

మండలంలోని కడ పాయపల్లె గ్రామం ఎస్సీ కాలనీలో నివాసమున్న కోటపాటి గోపాలయ్య (53) కడప నగరంలోని స్వీట్స్ బేకరీలో సేల్స్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం కొనసాగించేవాడు. మద్యానికి బానిసై చేసిన అప్పులు తీర్చలేక నిత్యం తగాదాలు పడుతుండేవాడు. సోమవారం రాత్రి కడప నుండి ఇంటికి వచ్చి మద్యం మత్తులో భార్యతో గొడవపడ్డాడు. భయభ్రాంతులకు గురైన భార్య నాగరత్న తన ముగ్గురు పిల్లలతో తన మేనత్త ఇంటికి వెళ్లి తలదాచుకున్నారు, మంగళవారం ఉదయం 6 గంటలకు వచ్చి చూడగా గోపాలయ్య స్పృహ లేకుండా ఇంట్లో పడి ఉన్నాడని, వైద్య సేవలు కోసం 108 అంబులెన్స్‌లో కడప రిమ్స్ తరలించగా కడప రిమ్స్ నందు మృతి చెందాడు. మృతుని కూతురు గోపిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై హారిక బుధవారం కేసు నమోదు చేశారు.

## బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ,



**మైదుకూరు, మార్చి 11, ప్రభాతవార్త:**

మైదుకూరు నియోజకవర్గం లోని ప్రజలకు సి.ఎం సహాయక నిధి కింద 39,33,218 రూపాయల సి.ఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నియోజవకవర్గానికి చెందిన 45 బాధిత కుటుంబాలకు ప్రొద్దుటూరు క్యాంప్ ఆఫీస్ నందు అందజేసిన నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఈ కార్యక్ర మంలో టిడిపి మండల నాయకులు కార్యకర్తలు, బాధితులు, వారి బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట ఆడుతున్న 16 మంది వ్యక్తుల అరెస్టు

**మైదుకూరు, మార్చి 11, ప్రభాతవార్త:**

మండలంలోని పోతిరెడ్డి పల్లె గ్రామ పొలాల వద్ద జూదమును ఆడుతుండగా పోలీస్ వారికి రాబడిన సమాచారం మేరకు జిల్లా ఎస్పీ మరియు మైదుకూరు డిఎస్పి ఆదేశాలతో జూదమును ఆడుతుండగా 16 మంది వ్యక్తులను పోలీసులు ఆధీనంలోనికి తీసుకొని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 14 మొబైల్ ఫోన్లు, 1,58,000 రూపాయల నగదు, 17 మోటార్ సైకిల్లను స్వాధీనం చేస్తున్నట్లు తెలిపారు. పారిపోయిన మరి కొంత మందిపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ దాడులలో ఎస్ఐలు చిరంజీవి మరియు వెంకట రమణ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శంబాజీ మహారాజ్ వర్ధంతి సందర్బంగా నివాళి

**సుండుపల్లె, మార్చి 11, ప్రభాతవార్త :**



శంభాజీ మహారాజ్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించిన సుండుపల్లె మండల అధ్యక్షులు యస్. వి. రమణ గౌడ్ బిజెపి నాయకులు కార్యకర్తలు శంభాజీ 1657 మే 14న పురందర్ కోటలో జన్మించారు. యువరాజు అయినందున, అతను చిన్నప్పటి నుండి యుద్ధభూమి ప్రచారాలకు రాజకీయాలకు గురయ్యాడు. అనేక చారిత్రాత్మక రికార్డుల ప్రకారం, శంభాజీ మహారాజ్ చాలా అందమైనవాడు ధైర్యవంతుడు. అతను అనేక భాషలలో పండితుడు చాలా తెలివైన రాజకీయవేత్త కూడా. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి మండల కార్యదర్శి మాగంటి నాగేశ్వరరావు శివ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పందుల వలన సమస్యలను పరిష్కరించాలి

**బద్వేలు, మార్చి 11, ప్రభాతవార్త**




పట్టణంలో పందుల సంచారం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్. చంద్రశేఖర్ అన్నారు. బుధవారం భగత్‌సింగ్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 35 వార్డుల్లో పందులు సంచరిస్తూ చిన్నపిల్లలు, మహిళలు, ద్విచక్ర వాహనదారులపై దాడులు చేసి గాయాలకు కారణమవుతున్నాయని తెలిపారు. పందుల యజమానులకు పట్టణంలోని డంపింగ్ యార్డ్ సమీపంలో ఉన్న 812 సర్వే నంబర్ భూమిలో ఒక్కొక్కరికి 5 సెంట్ల చొప్పున స్థలం కేటాయించి పందులను ఊరి బయటకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ విషయంపై గతంలో జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ మరియు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా ఇప్పటివరకు పరిష్కారం చూపలేదని విమర్శించారు. పందుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, అవసరమైతే పట్టణంలో ఉన్న పందులను మున్సిపల్ కార్యాలయానికి తోలుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బి. అనిల్, ఏరియా కమిటీ సభ్యులు విజయరావు, చంద్రపాల్, పట్టణ కమిటీ సభ్యులు రంతుబాషా, చిట్టిబాబు, గుర్రప్ప, శంసున్న్, శివ, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయండి

**కలసపాడు, మార్చి 11 ప్రభాతవార్త:**

మండలం ఎగువ తంబళ్లపల్లె ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పాఠశాల వార్షికోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు రవి క్రీస్తు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా క్లస్టర్ ఛైర్మన్ మెర్సీ మాలిని, ఏఈటిఎఫ్ ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, గ్రామస్తులు వెంకటేశ్వర ఆచారి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సుభాషిణిలు హాజరయ్యారు. ఈ సమావేశంలో వెంకటేశ్వర ఆచారి 12వేల విలువ చేసే సౌండ్ బాక్స్ ప్రింటర్‌ను పాఠశాలకు విరాళంగా అందించారు. ఆయనను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పిస్తే వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తామని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యను బోధిస్తున్నామన్నారు. కావున ఈ అవకాశాన్ని పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎందరో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. అనంతరం విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు వెంకటేశ్వర రెడ్డి, రమణారెడ్డి,పార్వతి, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# దేశభక్తి, క్రమశిక్షణ, సేవా భావానికి ప్రతీక స్కౌట్ : ఎమ్మెల్యే

**మదనపల్లె, మార్చి 11 ప్రభాతవార్త :**

దేశభక్తి, క్రమశిక్షణ, సేవా భావానికి ప్రతీక స్కౌట్ అని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. బుధవారం మద్యాహ్నం మదనపల్లెలోని హోప్‌మున్సిపల్ హైస్కూల్‌లో సమావేశపు మందిరంలో ఏర్పాటు చేసిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడూ స్కౌట్ శిక్షణతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు సమకూరుతుందన్నారు. నిజజీవితంలో విద్యార్థులు ఎదుర్కునే సవాళ్ళను అధిగమించడానికి స్కౌట్ శిక్షణ తోడ్పడుతుందన్నారు. హార్సిలీహిల్స్‌లో స్కౌట్ ప్రాంతీయ శిక్షణా కేంద్ర మరమ్మత్తులకు రూ.50వేలు విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు. మరో ముఖ్య అతిధి జిల్లా విధ్యాశాఖ అధికారి డాక్టర్ కె.సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాటశాలల్లో స్కౌట్ యూనిట్లను ఏర్పాటు చేయడం తప్పనిసరి అని తెలిపారు. జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో స్కౌట్ ఉద్యమాన్ని మరింత విస్తరించేందుకు ప్రణాళిక వద్దంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకొన్న వారికి సర్టిఫికెట్లును ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో ఏఎల్‌టి లక్ష్మీకర్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖరెడ్డి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు సిద్దారెడ్డి, ఈశ్వరయ్య, మహమ్మద్‌ఖాన్, హర్షవర్థన్‌రెడ్డి, లక్ష్మీపతి, విద్యాదరరావు, మధుకర్‌రెడ్డి, గైడు కెప్టనుల రమాభార్గవి, షమభాను, గీత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

# సమావేశాన్ని జయప్రదం చేయాలి

**బద్వేల్ అర్బన్ మార్చి 11 ప్రభాతవార్త :**

స్థానిక పురపాలక కార్యాలయంలోని సభా భవనం నందు నేడు జరగబోవు కౌన్సిల్ సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలోని కౌన్సిలర్లు,కోఆప్షన్ మెంబర్స్, వైస్ ఛైర్మన్లు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మున్సిపల్ ఛైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి తెలిపారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము మున్సిపల్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి నాటి నుండి మునిసిపాలిటీని అభివృద్ధి చేయడంలో తమ శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు, ఇప్పుడు వరకు తమకు పూర్తిస్థాయిలో సహకరించిన ఎమ్మెల్సీ డి.సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుద, మరియు పలువురు నాయకులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు, కావున సమావేశంలో పలువురు పాల్గొని కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని పలువురికి వారు పిలుపునిచ్చారు.



కేంద్ర క్రీడా శాఖ మంత్రితో మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

# ప్రజలకు నాణ్యమైన సేవలందించడమే లక్ష్యం: మున్సిపల్ కమిషనర్

**రాయచోటి మార్చి 11 ప్రభాతవార్త**

మున్సిపాలిటీలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యం అని అన్నమయ్య జిల్లా, రాయచోటి మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి అన్నారు. ఆయన ఈరోజు రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని వీధులల్లో పర్యటించారు. ట్రంక్ రోడ్డు ప్రధాన రహదారి నందు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగేలా మట్టి కుప్పను తొలగించకుండా నిరక్ష్యం చేసిన ఆ ఇంటి యజమానికి రూ. 5000 లు జరిమానా విధించిన అనంతరం అక్కడ ఉన్నటువంటి చెత్త మరియు మట్టి కుప్పను జెసిబితో ట్రాక్టర్ల ద్వారా తొలగించారు. సానిటేషన్ అధికారులు, కార్మికుల సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించి డ్రైనేజీలు శుభ్రపరచి ఎప్పటికప్పుడు చెత్త నిలువలను తొలగించాలని వారికి సూచించారు.పట్టణ పరిశుభ్రతకు శానిటేషన్ సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేసినప్పుడే మన ప్రాంతానికి మంచి పేరు వస్తుందన్నారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు కూడా ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా మున్సిపాలిటీ కార్మికులకు సహకరించాలని ఆయన కోరారు. ఇంటి నిర్మాణ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేసి వాహనదారులకు, పాదాచారులకు ఇబ్బందులు కలుగజేస్తే అలాంటి వారిపై కఠినమైన చర్యతో పాటు జరిమానాలు కూడా విధిస్తామన్నారు. వార్డుల్లో ఉన్నటువంటి ప్రధాన సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. వ్యర్థ పదార్థాలను బహిరంగ ప్రదేశాలలో వేయకుండా డస్ట్ బిన్, చెత్త వాహనాలలో వేసి సహకరించాలని ప్రజలను ఆయన కోరారు.



# ఘనంగా గంగమ్మ జాతర



**రామసముద్రం మార్చి 11 ప్రభాతవార్త**

పుంగనూరు సుగుటూరు గంగమ్మ జాతర మంగళవారం పుంగనూరు ప్యాలెస్‌లో దొరవారు కుటుంబ సభ్యులు తొలిపూజలు చేశారు. సాయంత్రం మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారిని వేదమంత్రాలతో పుష్పపల్లకిపై ఆశీణులు చేసి డప్పు వైయిద్యాలు, బానాసంచాలు కాలుస్తూ ఊరేగింపు పూర్తి చేసుకున్న అమ్మ వారిని నిర్వాహకులు బుధవారం వేకువజామున జమిందారీ ప్యాలెస్ లో ని సుగుటూరు గంగమ్మ ఆలయంలో భక్తుల దర్శనం కోసం కొలువుదీర్చారు, రాంపల్లె శ్రీ విరూపాక్షి మారెమ్మ విగ్రహాలను చాందినీ బండ్లపై ఏర్పాటు చేసి ఊరేగించారు, రామసముద్రం మండల ఎంపిపి రమణారెడ్డి దంపతులు అమ్మవారికి మట్టికుండను పసుపు, కుంకుమ పెట్టి వేపాకు చుట్టి నియమ నిష్టలతో గంగమ్మకు గెరిగెలు మోసి మొక్కలు చెల్లించుకున్నారు. అలాగే పుంగనూరు టౌన్‌కి చెందిన భక్తవత్సలరాజు, టిడిపి నాయకులు సుబ్రహ్మణ్యం రాజు ప్రజలకు విందు ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గంగజాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ దీరజ్ కనిబిల్లి ఆధ్వర్యంలో డిఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఫైర్ సిబ్బంది గట్టి భందొబస్త్ నిర్వహించారు.

# ప్రాంగణ ఎంపికలో 95 మందికి ఉద్యోగార్హత



ఉద్యోగాల కోసం ఎంపికైన విద్యార్థులతో కంపెనీల ప్రతినిధులు

**పీలేరు మార్చి 11 ప్రభాతవార్త:**

పీలేరులో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 95 మంది విద్యార్థులు ఉద్యోగాల కోసం అర్హత సాధించారని మార్గదర్శి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కె. నాగార్జున రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మార్గ దర్శి డిగ్రీ కళాశాలలో జరిగిన ఇంటర్వ్యూల్లో తిరుపతికి చెందిన డిక్సన్ టెక్నాలజీస్, బెంగళూరుకు చెందిన ఆటోలీవ్, ఏపిటిఐవి కంపెనీలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికల్లో 120 మంది విద్యార్థులు ఇంటర్వ్యూ, పరీక్షలకు హాజరు కాగా, వారిలో 95 మంది విద్యార్థులు ఉద్యోగాల కోసం అర్హత సాధించారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాదికి రూ. 2.40 లక్షలు వేతనం, ఇతర అలవెన్సులు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. చంద్రశేఖర్ నాయుడు, డైరెక్టర్లు ఎం. లోకేశ్వర రెడ్డి, ఆర్. సుధానంద రెడ్డి, పి. జనార్ధన రెడ్డి, ఎస్. చంద్ర శేఖర్, సంస్థ ప్రతినిధులు పాల్గున్నారు. విద్యార్థులు ఇదే స్పూర్తితో మునుముందు కూడా తాము నిర్వహించే ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు పొందడానికి కృషి చేయాలని కళాశాల కరస్పాండెంట్ తెలియజేశారు.

# ప్రజల ప్రత్యక్ష పరిష్కారాల వేదిక ప్రజాదర్బార్

**టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు**



ప్రజల సమస్యలు ఆలకిస్తున్న జగన్మోహన్ రాజు

**రాజంపేట, మార్చి 11 ప్రభాతవార్త:**

ప్రజలు,పార్టీ,అధికారుల సమన్వయంతో సమస్యల పరిష్కారం చేయడమే ప్రజా దర్బార్ లక్ష్యమని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు అన్నారు. ప్రత్యక్ష పరిష్కారాల వేదిక ప్రజాదర్బార్ అని అన్నారు. వీరబల్లి మండలంలో ప్రయోగాత్మకంగా అన్ని గ్రామ పంచాయతీలలో క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పూర్తిస్థాయిలో పరిష్కారానికి అధికారులతో కలిసి పని చేస్తున్నట్టు తెలిపారు. బుధవారం ఓదివీడులో గ్రామసభ నిర్వహించారు.గ్రామ సమస్యలు, ఇంటి సమస్యల గుర్తింపు, పరిశీలన, పర్యవేక్షణ, పరిష్కారం అక్కడికక్కడే చేస్తున్నామన్నారు. గుర్తించిన సమస్యలలో 80 శాతం అక్కడే పరిష్కారం చేసినట్టు వెల్లడించారు. రెవెన్యూ సమస్యలకు ఎమ్మార్వో సమక్షంలో పరిష్కారం చేస్తున్నామన్నారు. పశు వైద్య ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా పాడి రైతులకు వైద్యుడిని ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి ట్రాన్స్ఫార్మర్ కేటాయింపు, ఇది కలెక్షన్ల పని పూర్తి చేసామన్నారు. ఎండిఓ ఆధ్వర్యంలో త్రాగునీరు, వీధిలైట్లు, డ్రైనేజ్ సమస్యల పరిష్కారం చేస్తున్నామన్నారు. ప్రజల సమస్యలను తీర్చటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. .ప్రజా దర్బార్ ద్వారా సమస్యల పరిష్కారం త్వరితగతిన జరుగుతున్న విధానం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఇది ఎంతో తృప్తినిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి వీరబల్లి అధ్యక్షుడు భానుమూర్తి రాజు, తాసిల్దార్ ఖాజాబీ, ఎంపీడీవో జవహార్ బాబు, పంచాయతీరాజ్ ఏఇ ఠాగూర్ వ్యవసాయ శాఖ అధికారి స్వాతి, వెటర్నరీ డాక్టర్ నగేష్, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**కలసపాడు, మార్చి 11 ప్రభాతవార్త:**



మాట్లాడుతున్న ఎంపీపీ నిర్మల నారాయణ

రాబోయే వేసవి కాలంలో మంచినీటి ఎద్దడి ఎదురు కాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కలసపాడు మండల అధ్యక్షురాలు బోధన బోయిన నిర్మల నారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో సభా భవనంలో ఎంపీపీ బోధన బోయిన నిర్మల నారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే వేసవికాలంలో తాగునీటి ఎద్దడి ఎదురుకాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా గ్రామపంచాయతీ సచివాలయాల్లో అధికారులు ఎప్పటికప్పుడు మంచినీటి సమస్యపై స్పందిస్తూ ముందస్తుగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మండలంలోని తాగునీటి వనరులు ఏ విధంగా పనిచేస్తున్నాయి. ఏ ఏ రకాలు పరికరాలు కావాలనే వివరాలను ముందుగా ప్రజల నుంచి తెలుసుకొని వాటిని సిద్ధం చేసుకోవాలని ఆమె తెలిపారు. ఆర్డబ్ల్యూఎస్ ఏ రాము మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి సమస్య ఉంటే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని ప్రస్తుతం సర్పంచుల కాల వ్యవధి ముగియడంతో పంచాయతీ కార్యదర్శులు తమ కు నీటి సమస్యను తెలపాలన్నారు. మండలంలో ఎక్కడ నీటి సమస్య లేకుండా నీటి సమస్య తీర్చడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా విద్యుత్ సమస్యపై ఏ ఈ పైరాజుపాలెం సర్పంచ్ సుధా రామకృష్ణారెడ్డి మండిపడ్డాడు. ఏఈ మాట్లాడుతూ నేను కొత్తగా వచ్చానని ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తారని తెలియజేశారు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా ఖచ్చితంగా ఇస్తున్నామని తెలియజేశారు. ఆర్ ఐ సింధుజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కొత్త పాస్ బుక్కులు అందజేయడం జరుగుతుందని రీ సర్వే జరిగే చోటా కొన్ని అభ్యంతరాలు వస్తున్నాయని వాటిని కూడా సవరించి కొత్త పాసుబుక్కులు ఇస్తామన్నారు. అదే విధంగా అన్ని శాఖల అధికారులు వారి వారి పాలన గురించి వివరించారు. ఎంపీడీవో మహబూబ్ బి మాట్లాడుతూ ఈ రామాపురం సర్పంచ్ సేవలు పై కొనియాడారు. అనంతరం సర్పంచ్ లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అంకన గురివిరెడ్డి, ఎంపీటీసీలు సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు వేదవ్యాస విద్యార్థులు ఎంపిక

**ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 11 ప్రభాతవార్త**



నెహ్రూ రోడ్డులో ఉన్న వేదవ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థులు మరో సారి తమ ప్రతిభను చాటుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రామ డాక్ సేవక్ (జీడిఎస్) ఉద్యోగాలకు కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్న ఎం.మనోజ్ఞ,రెండవ సంవత్సరం చదువుతున్న యు.రఫీలు గ్రామ డాక్ సేవక్ పోస్టులకు దరఖాస్తు చేసుకోగా, సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం విడుదలైన ఫలితాల్లో వీరు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ ఎల్. నాగేశ్వర రెడ్డి తెలిపారు. ఈ శిక్షణ వల్ల ఇప్పటికే కళాశాలకు చెందిన అనేక మంది విద్యార్థులు ప్రముఖ సాఫ్ట్వేర్ కంపెనీలలో ఉద్యోగాలు సాధించారని చెప్పారు. తాజాగా ఇద్దరు విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ జి. సుదర్శన రెడ్డి, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్లు కే. నాగరాజ, వి. రామలక్ష్మి రెడ్డి, సృజన్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు, అధ్యాపకులు అభినందించారు.

# విద్యార్థులతో మాక్ అసెంబ్లీ కార్యక్రమం



**సిద్ధవటం మార్చి 10 ప్రభాతవార్త:**

11 వ పోలీసు బెటాలియన్‌లో కమాండెంట్ కే ఆనంద రెడ్డి, ఆదేశాలమేరకు బెటాలియన్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థిని మరియు విద్యార్థులకు మాక్ అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా, కమాండెంట్ ఆనందరెడ్డి హాజరు అయినారు. అసెంబ్లీ కార్యకలాపాలతో విద్యార్థులకు పరిచయం చేయడానికి మరియు బహిరంగ ప్రసంగంలో విశ్వాసాన్ని పెంపొందించడానికి యూనిట్ జెడ్‌పి హైస్కూల్ పిల్లలతో మాక్ అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించినారు ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పియెన్‌డి ప్రసాద్ ఆర్ఐలు ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, స్కూల్ హెడ్ మాస్టర్ శ్రీ పోతులురయ్య, టీచర్లు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# చెన్నకేశవ ఆలయంలో వేలం పాట

**పెండ్లిమర్రి, మార్చి 11, ప్రభాతవార్త:**

మండలంలోని వెల్లటూరు చెన్నకేశవ స్వామి ఆలయంలో గ్రామానికి చెందిన షాపు ఈ నెల 18న ఉదయం 11 గంటలకు దేవస్థానం వద్ద బహిరంగ వేలం జరపడం జరుగుతుందని ఆలయ ఈవో మారుతీ ప్రసాద్ తెలిపారు. వేలం పాటలో హిందువులు మాత్రమే పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

# రూ. 8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు



భూమి పూజ చేస్తున్న దృశ్యం

**పీలేరు, మార్చి 11 ప్రభాతవార్త:**

స్థానిక ఏరియా ఆస్పత్రిలో రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపదుతున్నట్లు ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, పీఆర్ జేఈ రామకృష్ణ నాయక్ తెలిపారు. బుధవారం స్థానిక ఆస్పత్రి ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాదుతూ పెండింగ్లో ఉన్న ఆస్పత్రి ప్రహరీగోడ నిర్మాణ పనులు కూడా చేపదుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు కోటపల్లె బాబురెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, ఏఎంసీ డైరెక్టర్ కిషోర్ నాయుడు, తెదేపా నాయకులు దేవిరెడ్డి రమణారెడ్డి, హరి, రమాదేవి, లక్ష్మీకాంతమ్మ, చంద్రలేఖ తదితరులు పాల్గొన్నారు.

# బద్వేల్లో రంజాన్ ఇఫ్తార్ విందు



**బద్వేలు, మార్చి 11, ప్రభాతవార్త**

బద్వేలు పట్టణంలోని ఫాతిమా మసీదులో బుధవారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగళరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముక్తియార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నాయకులు ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. రంజాన్ మాసం మానవత్వం, క్రమశిక్షణ, సేవా భావాన్ని గుర్తు చేస్తుందని వారు పేర్కొన్నారు. ఈ పవిత్ర మాసంలో పరస్పర ప్రేమ, సౌహార్దం మరింత బలపడాలని కోరుకున్నారు. బద్వేలు నియోజకవర్గ ప్రజలు కులమతాలకు అతీతంగా సఖ్యతతో జీవించాలని, రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యాలు కలగాలని అల్లాహ్‌ను ప్రార్థించినట్లు తెలిపారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం మరియు వారి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందనిచెప్పారు.

# చీటింగ్ కేసులో ముగ్గురు ముద్దాయిలు అరెస్ట్

**కడప క్రైం, మార్చి 11, ప్రభాతవార్త:**

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో కడప టుటౌన్ పీఎస్‌లో నమోదైన చీటింగ్ కేసులో ముగ్గురు ముద్దాయిలను బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ ప్రసాదరావు తన సిబ్బందితో అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్దాయిలు అయిన రజనీసింగ్, చిన్న సుబ్బు మంజునాథరెడ్డి, నడ్డి సురేంద్రలు నకిలీ బంగారు ఇచ్చి మోసం చేస్తుండేవారు. ఇదే క్రమంలో కడప నగరానికి చెందిన సోనీరాజ్ మరో ఇద్దరి వద్ద 3 నకిలీ చైన్లను కుదువ పెట్టి వారి వద్ద నుంచి రూ.4.20లక్షలు మోసం చేశారు. సోనీరాజ్ ఫిర్యాదు మేరకు ఆరు నెలల క్రితం నమోదైన కేసులో ముద్దాయిలను అరెస్టు చేయడం జరిగిందన్నారు. వారి నుంచి నకిలీ బంగారు చైన్లు, రూ.2.30లక్షలు నగదు, టీవీఎస్ బైకు, ఒక వెండి మొలతాడు, ఒక మొబైల్ ఫోన్ తదితర వాటిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ముద్దాయిలను అరెస్టు చేయడంలో కృషి చేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



# పిహెచ్సిలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమం ఏర్పాటు..

**యర్రగుంట్ల మార్చి 11 ప్రభాతవార్త:**

గర్భాశయ క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించేందుకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఉచిత కార్యక్రమం స్థానిక పీహెచ్‌సీలో 14 ఏళ్లు నిండి 15 ఏళ్లలోపు బాలికలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో ఈ టీకాను వెయ్యనున్నట్లు యర్రగుంట్ల వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. అర్హత కలిగిన వారు స్థానిక సచివాలయంలోని ఆరోగ్య కార్యదర్శి వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

# విచారణ నిష్పక్షపాతంగా జరగాలి: మందకృష్ణ

**పోరుమామిళ్ల రూరల్, మార్చి 11 ప్రభాతవార్త:**



కలసపాడు మండలం ముద్దంవారిపల్లెకు గ్రామానికి చెందిన ఇమాన్యుల్, కాశినాయన మండలం గంగనపల్లి గ్రామానికి చెందిన దిలీప్ అనుమానస్పద రీతిలో మృతి చెందారు. బుధవారం వారి కుటుంబ సభ్యులను ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వరుసగా దళిత యువకులను టార్గెట్ చేస్తూ హత మారిస్తే ఊరుకోమని హెచ్చరించారు. దళిత యువకుడు దిలీప్ మృతి ఆత్మహత్య కాదని ప్రేమ వ్యవహార హత్య అన్నారు. ఈ కేసులో పోలీసు ఉన్నతాధికారులు నీరు కార్చకుండా సమగ్ర విచారణ చేపట్టి నిందితులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దిలీప్ ఆత్మహత్య చేసుకోవాల్సిన అంత పిరికివాడు కాదన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ స్వయంగా ఆ యువకుడే తన తల్లిని చూసుకోవాలని తాను ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం లేదని తన్నపై కొందరు పెట్రోల్ పోసి నిప్పంటించారని వాగ్మూలం ఇచ్చాడన్నారు. ఇవన్నీ క్లుప్తంగా ఉన్నాయని వాటిపై సమగ్ర విచారణ చేస్తే నిజమైన నిందితులు దొరుకుతారన్నారు. దిలీప్ మృతి కూడా కేవలం సెల్ టవర్ ఆధారంగా కాకుండా మరో కోణంలో విచారించాలని పోలీసులను కోరారు.

## అద్భుత శిల్ప కళా సంపదకు నిలయం

# ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయం

**తూర్పు గాలిగోపురం శిల్పకళా సంపదను పునరుద్ధరిస్తే...**

**నభూతో ... నభవిష్యత్...**



**ఒంటిమిట్ట, రాజంపేట,మార్చి 10 ప్రభాతవార్త:**

భారత దేశంలోనే ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో ఒంటిమిట్ట కోదండ రామాలయం ఒకటని, ప్రముఖ చరిత్రకారుడు ఫ్రైనాకుచెందిటావెర్నియర్ ఈ ఆలయాన్ని సందర్శించినప్పుడు పేర్కొన్నారు. అంటే ఆలయ చరిత్ర, శిల్పకళా సంపద ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.ఆలయంలోని శిల్పాలు విజయనగర కాలం శిల్పకళ వైభవాన్ని స్మరింపజేస్తాయి. ముఖ్యంగా రంగమండపంలోని యాళి స్తంభాలు దర్శనార్థులను ఆకట్టుకుంటాయి. భారీ గండశిలలను యాళి స్తంభాలుగా మలచిన తీరు శిల్పుల అపూర్వ నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుంది. రాయల వంశ కాలంలో నిర్మితమైన అనేక ఆలయాలలో యాళి స్తంభాలు కనిపిస్తాయి. అయితే ఒంటిమిట్ట ఆలయంలో ఒక్కో స్తంభం మధ్యలో నిలువుగా ఖాళీ స్థలం ఉండి, అందులో ఒక వ్యక్తి కూర్చోగలిగే విధంగా ఉండటం ప్రత్యేకతగా నిలుస్తుంది. రంగమండపంలోని స్తంభాలపై పురాణ ఘట్టాలను ప్రతిబింబించే శిల్పాలు ఎంతో అందంగా చెక్కబడి భక్తులను మంత్రముగ్ధులను చేస్తాయి. వాటిలో రెండు స్తంభాలు సంప్రదాయ పేట్రస్ శైలిలో ప్రత్యేకంగా తీర్చిదిద్దబడి ఆకర్షణీయంగా నిలుస్తాయి.

### శ్రీ కోదండరామాలయం చరిత్ర

పురాణాల ప్రకారం త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు సీతా లక్ష్మణ సమేతుడై దండకారణ్యంలో సంచరిస్తున్న సమయంలో, సీతాదేవి దప్పిక తీర్చేందుకు భూమిలోకి బాణం సంధించగా అక్కడ నీటి బుగ్గ ఉద్భవించింది. అదే నేటి ఒంటిమిట్టలోని పవిత్ర రామతీర్థంగా భావిస్తారు.రావణ సంహారం కోసం శ్రీరాముడికి సహకరించిన జాంబవంతుడు సేవించిన శ్రీ సీతా లక్ష్మణ సమేత రామచంద్రుడే నేడు ఒంటిమిట్ట ఆలయంలో కొలువై ఉన్నారని భక్తుల విశ్వాసం. ఒకే రాతిపై శ్రీ సీతా రామ లక్ష్మణుల విగ్రహాలు చెక్కబడినందున ఈ ప్రాంతాన్ని ఏకశిలా నగరం" అని కూడా పిలుస్తారు. ఆలయంలోని శాసనాల ప్రకారం ఈ దేవాలయ నిర్మాణం 14వ శతాబ్దంలో ప్రారంభమై 17వ శతాబ్దానికి పూర్తయింది. 1356లో బుక్కరాయలు ప్రారంభించిన ఈ నిర్మాణాన్ని అనంతరం విజయనగర రాజులు, మట్లి రాజులు అభివృద్ధి చేశారు. అంతరాలయం, రంగమండపం, మహా ప్రాంగణం, గోపురాలు వంటి నిర్మాణాలు ఈ కాలంలో నిర్మితమయ్యాయి.

### ఎందరో కవులకు నిలయం ఒంటిమిట్ట

ఒంటిమిట్ట క్షేత్రం ఎన్నో మంది మహాకవులకు ప్రేరణనిచ్చిన పుణ్యభూమిగా ప్రసిద్ధి చెందింది. మహాకవి శ్రీ పోతన మాత్యులు ఇక్కడే భావగవతాన్ని రచించినట్లు విశ్వసిస్తారు. అయ్యలరాజు తిప్పయ్య ఒంటిమిట్ట శ్రీ కోదండరామునిపై రఘువీర శతకం రచించి అంకితం చేశారు. రామభద్రకవి రామాభ్యుదయం రచించారు.నల్లకాల్వ అయ్యప్ప ఒంటిమిట్ట రాముని అనుగ్రహంతో వరకవిగా ప్రసిద్ధి పొందారు. ఉప్పుగుండూరు వేంకటకవి దశరథరామ శతకం రచించారు. ఆంధ్రవాల్మీకిగా ప్రసిద్ధిగాంచిన వావిలికొలను సుబ్బారావు ఆంధ్రవాల్మీకి రామాయణంను రచించారు. తాళ్ల పాక అన్నమయ్య శ్రీరాముని మహిమను కీర్తిస్తూ అనేక సంకీర్తనలు ఆలపించారు.

### 2015 సెప్టెంబర్ 09న టిటిడిలో విలీనం

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయం రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉండగా, 2015 సెప్టెంబర్ 09న టిటిడిలో విలీనం అయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం శ్రీ సీతారాముల కల్యాణాన్ని ఒంటిమిట్టలో రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 01వ తేదీన శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చురుకుగా చేపడుతోంది. కనీసం వచ్చే సీతారాముల కళ్యాణం నాటికైనా తూర్పు గాలిగోపురంలో ఉండే శిల్పకళా సంపదను పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ పని పూర్తి చేస్తే ఆలయం సంపూర్ణంగా అభివృద్ధి చెందినట్లే అని చెప్పవచ్చు.



### శ్రీ సీతారాముల కల్యాణం వైభవం

ప్రతి ఏడాది శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఒంటిమిట్టలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని టీటీడీ ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమ విధానంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. దేశంలోనే రాత్రివేళ పౌర్ణమి నాడు సీతారాముల కళ్యాణం నిర్వహించేది ఒంటిమిట్టలో మాత్రమే. సీతారాముల కళ్యాణం అనంతరం ఆలయం నుండి కల్యాణ వేదిక వరకు శ్రీ సీతారాముల ఉత్సవ మూర్తుల శోభాయాత్ర నిర్వహిస్తారు. అనంతరం అర్చకులు భగవత్ ప్రార్థనతో ప్రారంభించి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, యజ్ఞోపవీతధారణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.తదుపరి వస్త్ర సమర్పణ, మధుపర్కం, మహాసంకల్పం, కన్యాదానం జరుగుతాయి. అనంతరం జీలకర్ర-బెల్లం, మాంగల్యపూజ, అక్షతారోపణం, మాలపరివర్తనం వంటి మంగళకార్యాలు నిర్వహించి వేదాశీర్వాదాలతో శ్రీ సీతారాముల కల్యాణం ముగుస్తుంది. కల్యాణం అనంతరం భక్తులకు ముత్యాలతో కూడిన తలంబ్రాలను టీటీడీ అందజేస్తుంది. ఈనెల 27 నుంచి శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి ఏపీలో 1న సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తోంది. సీతారాముల కళ్యాణానికి ముఖ్యమంత్రి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు.